

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 30-03-2026 | సంపుటి - 27 | సంచిక -307 | రూ : 4 | పేజీలు: 8


## కేరళను దోచేస్తున్న ఎల్డీఎఫ్, యూడీఎఫ్



- ఈసారి రాబోయేది ఎన్డీయే సర్కారే
- అవినీతి డబ్బును రాబట్టి అభివృద్ధికి ఖర్చుచేస్తాం
- పాలక్కాడ్ సభలో ప్రధాని మోదీ

పాలక్కాడ్: వామపక్షాల నేతృత్వంలోని ఎల్డీఎఫ్, కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యూడీఎఫ్‌లు కేరళను దోచుకుంటూ వస్తున్నాయని ప్రధాని నరేంద్రమోదీ ఆరోపించారు. భాజపా నేతృత్వంలోని ఎన్డీయే 2లో





2లో

## సీఐడీతో కాదు.. సిటింగ్ జడ్జితో విచారణ జరిపిద్దాం

- మా కుటుంబీకులపై చేసిన ఆరోపణలపై ఎంక్వయిరీకి సిద్ధం
- మీ కుటుంబ సభ్యుల స్కామ్‌లపై మీరు రెడీనా?
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు సవాల్

హైదరాబాద్: "మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అక్రమాలు బయటపడగానే.. నాపై బురద జల్లే ప్రయత్నం చేశారు. నా బావమరిది, నా తమ్ముడి పేర్లు ప్రస్తావిస్తూ మాపై ఆరోపణలు చేశారు. మా కుటుంబ సభ్యులపై చేసిన ఆరోపణలపై మేం విచారణకు సిద్ధం. మరి మీ సోదరులు, బావమరిది కుంభకోణాలపై మీరు విచారణకు రెడీనా? హౌస్‌కమిటీ, సీఐడీతో విచారణ కాదు.. తరువాయి 2లో

## దళితులను దగా చేశారు

- ఇప్పుడు స్పీకర్, వివేక్‌లపైనా కుట్ర చేస్తున్నారు
- బ్లాక్ మెయిల్ చేయడానికే మైనింగ్‌పై సభాసంఘం కోరుతున్నారు
- పొంగులేటి కాదు.. సభకు రాని కేసీఆర్‌తో రాజీనామా చేయించాలి
- నా దగ్గర మీ పప్పులుడకవ్
- ఆధారాలుంటే చూపండి
- మీరు కోరితే సీబీఐ విచారణకైనా సిద్ధం

శాసనసభలో భారాసపై విరుచుకుపడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2లో



## కృష్ణా తీరం.. విహంగ విహారం..
## ప్రకృతి ప్రేమికులకు పండుగే

- పర్యాటకులను కట్టిపడేసే అందాలు
- కృష్ణ, నల్లమల మీదుగా హెలికాప్టర్ ప్రయాణం
- హైదరాబాద్ నుంచి సేవలు



హైదరాబాద్ : నల్లమల అటవీ ప్రాంతం ప్రకృతి, జీవవైవిధ్యానికి ప్రసిద్ధి. ఎత్తైన కొండలు, లోతైన లోయలు, విస్తరించిన పచ్చని అడవులు ఈ ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణను తీసుకువస్తోంది. పక్షుల కిలకిలరావాలు, వన్యప్రాణుల సంచారం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది. కృష్ణా నదీతీరంలో ఉన్న సోమశిల ఆలయ ప్రశాంత వాతావరణం సందర్శకులను కట్టిపడేస్తోంది. ఇక్కడి నుంచి శ్రీశైలం వరకు సాగు బోటు ప్రయాణం పర్యాటకులకు జీవితంలో మధురానుభూతిని కలిగిస్తోంది. తరువాయి 2లో





## అమెరికా అవాక్స్ ధ్వంసం

- యుద్ధంలో అగ్రరాజ్యానికి గట్టి ఎదురుదెబ్బ
- ఇరాన్ దాడిలో పూర్తిగా దెబ్బతిన్న అత్యాధునిక నిఘా విమానం
- పాక్‌లో ఈజిప్టు, సౌదీ, తుర్కియే విదేశాంగ మంత్రుల భేటీ
- వాషింగ్టన్‌టెహ్రాన్ మధ్య ప్రత్యక్ష చర్చలకు ప్రయత్నాలు
- ఇరాన్ విశ్వవిద్యాలయాలపై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్
- ప్రతీకార దాడులు తప్పవన్న ఐఆర్‌జీసీ
- తమ గడ్డపై అడుగుపెడితే అమెరికా సైనికులను బుగ్గి చేస్తామన్న ఇరాన్ పార్లమెంటు స్పీకర్

2లో

## సూపర్‌హిట్ దీదీ మోడల్!



2లో

- మమతను తిరుగులేని శక్తిగా నిలిపిన సంక్షేమం, మమేకం
- మరోసారి గెలిచేందుకు మరిన్ని పథకాలు

పశ్చిమ బెంగా : మమతా బెనర్జీ.. పశ్చిమ బెంగాల్ ఫైర్ బ్రాండ్. ఢీ అంటే ఢీ అనే మనస్తత్వం.. ఏ విషయంలోనూ రాజీలేని ధోరణి.. ఇది ఒకప్పటి మాట.. ఇప్పుడు.. మమత అంటే నిజంగానే ప్రజలపై మమత చూపే నేత. సంక్షేమాన్ని, ప్రజలపై శ్రద్ధ తరువాయి 2లో



## కార్యకర్తల త్యాగాలను.. జీవితాంతం గుర్తుపెట్టుకోవాలి

- ఇకపై వారికి ఉచిత వైద్య పరీక్షలు
- జగన్‌రెడ్డికి క్రెడిట్ చోరీ డిజార్డర్
- తెదేపా ఆవిర్భావ దినోత్సవంలో మంత్రి లోకేశ్

అమరావతి: తెదేపా అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం కార్యకర్తల త్యాగాలని, వారిని జీవితాంతం గుర్తుపెట్టుకోవాలని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు. ఇక నుంచి క్లస్టర్, యూనిట్, బూత్, జాతీయ, రాష్ట్ర, మండల, డివిజన్, గ్రామ కమిటీల్లో ఉన్నవారందరికీ ఉచితంగా పరీక్షలు చేయించి.. వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించే ఏర్పాటు (ఫాలోఅప్ కేర్) చేస్తామని చెప్పారు. కార్యకర్తలు కొందరు అలకలు వీడాలని.. కార్యకర్తలు అలిగితే రాష్ట్ర ప్రజలు నష్టపోతారని అన్నారు. 'మై టీడీపీ' యాప్‌లో సీబీఎన్ కనెక్ట్ ఆప్షన్ ద్వారా ఎవరైనా తమ అభిప్రాయాలను ముఖ్యమంత్రికి తరువాయి 2లో

## కార్యకర్తే అధినేత...

- సమర్థంగా పనిచేస్తే.. ప్రజాప్రతినిధులు మీరే
- పునర్విభజనతో 50% సీట్లు పెరుగుతున్నాయి.. మహిళలకు 33% రిజర్వేషన్
- కార్యకర్తలను పట్టించుకోని నాయకులు మాకు అవసరం లేదు
- తెదేపా 44వ ఆవిర్భావ దినోత్సవ సభలో పార్టీ అధినేత చంద్రబాబు

అమరావతి: సమర్థంగా పనిచేసేవారే రాబోయే రోజుల్లో ప్రజాప్రతినిధులవుతారని, వారికే గుర్తింపు, అన్ని రంగాల్లో రాణింపు ఉంటాయని ముఖ్యమంత్రి, తెదేపా అధినేత చంద్రబాబు కార్యకర్తలకు హామీ ఇచ్చారు. నియోజకవర్గాల పునర్విభజన కారణంగా ఈసారి 50% సీట్లు పెరిగే అవకాశం ఉందని, చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు వస్తున్నాయని చెప్పారు. క్రమశిక్షణతో పనిచేసి పార్టీని పటిష్ఠం చేయాలని, అలాంటివారిని గుర్తించే బాధ్యత లోకేశ్ తీసుకుంటారని వివరించారు. 'రాజకీయం చేస్తా. అదే సమయంలో అభివృద్ధి, సంక్షేమం ఇస్తా' తరువాయి 2లో



## గల్ఫ్ ప్రాంతాన్ని సురక్షితంగా దాటిన రెండు భారత నౌకలు



2లో

- భారత్ తీరం వైపు వస్తున్న రెండు భారీ ఎల్పీజీ నౌకలు
- సుమారు 94,000 టన్నుల ఎల్పీజీతో ప్రయాణం
- గల్ఫ్ ప్రాంతంలో భారత నావికులు, నౌకలు క్షేమంగా ఉన్నారని కేంద్రం ప్రకటన
- ఇప్పటివరకు 942 మంది భారత నావికుల తరలింపు

# దళితులను దగా చేశారు

హైదరాబాద్: దళితులను భారాస ఆది నుంచి దగా చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే తొలి ముఖ్యమంత్రిగా దళితుడినే చేస్తామనే హామీని కేసీఆర్ తుంగలో తొక్కారని, మంత్రివర్గంతో పాటు అన్ని పదవుల్లో నాడు వారికి అన్యాయం చేశారని విమర్శించారు. మైనింగ్ అంశంపై రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాజీనామాను డిమాండ్ చేస్తూ ఆదివారం శాసనసభలో భారాస నిరసన కొనసాగిస్తుండగా ముఖ్యమంత్రి ప్రసంగించారు. ''దళితుడైన భట్టి విక్రమార్కను నాడు విపక్ష నేతగా ఉండకుండా భారాస కుట్ర చేసింది. ఇప్పుడు ఆయన బడ్జెట్ ప్రవేశపెడితే వారు సభకు అంతరాయం కలిగిస్తున్నారు. మంత్రి వివేక్, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌లపైనా కుట్రతో నిరసనలు చేస్తున్నారు. కేసీఆర్‌తో సరిసమానమైన నేత కడియం శ్రీహరిని అవమానించారు. పొంగులేటిని బ్లాక్‌మెయిల్ చేయడానికే సభాసంఘం కోరుతున్నారు.

**భట్టిని అవమానిస్తున్న హరీశ్‌రావు**

తెలంగాణ వచ్చాక ఎన్నికల్లో భారాస గెలిచిన తర్వాత దళితుడికు పరిపాలన చేయరాదంటూ వారిని అవమానించి కేసీఆరే సీఎం పదవి చేపట్టారు. రాజయ్యకు ఉప ముఖ్యమంత్రి పదవినిచ్చి కొన్ని రోజుల్లో బర్తరఫ్ చేశారు. 2018లో దళితులలో కొప్పుల ఈశ్వర్ ఒక్కరికే మంత్రివర్గంలో చోటిచ్చారు. దళితుడైన భట్టిని ప్రధాన ప్రతిపక్ష నేతగా కాంగ్రెస్ నియమించగా, ఆ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని ఓర్వలేకపోయారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు 16 మందిని భారాసలోకి తీసుకొని ఆయనకు విపక్షనేత హోదా రాకుండా చేశారు. ఇప్పుడు మా ప్రభుత్వంలో ఆయన ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆయనను అవమానించేలా మాట్లాడుతున్నారు. దళితుడు ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రిగా ఉండొద్దని ఆలోచన చేస్తున్నారు. వ్యక్తిగతంగా భట్టిని హరీశ్‌రావు లక్ష్యంగా చేసుకొని అవమానిస్తున్నారు.

*** కాంగ్రెస్‌లో దళిత, గిరిజనులకు అవకాశాలు**

భారాస ప్రభుత్వంలో కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్, దయాకర్‌రావు, వినోద్‌రావు, సంతోష్‌రావులాంటి వారే ఉండేవారు. మా ప్రభుత్వంలో భట్టి విక్రమార్క, దామోదర్ రాజనర్సింహ, సీతక్క, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, రామచంద్రునాయక్, వేముల వీరేశం, అద్దంకి దయాకర్.. ఇలా ఎంతోమంది దళిత, ఆదివాసీలకు పదవులిచ్చాం. స్పీకర్‌గా దళితుడు ఉండవద్దనే.. వాళ్లు పోడియం ముందుకు వచ్చి గొడవ చేస్తున్నారు. దళితులు మంత్రులుగా ఉండకూడదని, పరిపాలన చేయొద్దని కుట్రలు చేసి కుల వివక్ష ప్రదర్శిస్తున్నారు. స్పీకర్ స్థానంలో దళితుడు ఉన్నారని, ఆయన ముందు చేతులు కట్టుకొని నిలుచొని మైక్ అడగాల్సి వస్తుందని కేసీఆర్ సభకు రావడంలేదు. స్పీకర్, గనులశాఖ మంత్రి వివేక్ సమర్థంగా పనిచేస్తుంటే వారు విఫలమయ్యారని చెప్పేందుకు సభలో భారాస వారు అల్లరి చేస్తున్నారు. సభా సంప్రదాయాలకు వ్యతిరేకంగా స్పీకర్‌ను డిక్టేట్ చేసే సంస్కృతి ఎక్కడిది? స్పీకర్ ఎవరికి అవకాశం ఇస్తే వాళ్లు సభలో మాట్లాడాలి. సభలో కడియంకు జరిగినట్లుగా కేసీఆర్‌కు జరిగితే మీరు సమర్థిస్తారా? మా దగ్గర కూడా తిరిగేసి కొట్టేవారు ఉన్నారు. కానీ ఇక్కడ మనం కుస్తీలు పట్టడానికి రాలేదు. సీనియర్ సభ్యులను అవమానించే ఇలాంటి వ్యవహార శైలి మంచిది కాదు. దీనికి ఇక్కడే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**భారాస చెప్పినట్లుగా ప్రభుత్వం వినాలా?**

పొంగులేటితో రాజీనామా చేయించాలి అంటూ భారాస సభ్యులు నినాదాలు చేస్తున్నారు. మా సహనానికీ ఒక హద్దు ఉంటుంది. ప్రజల సొమ్ముతో రూ.కోటి పది లక్షల జీతం తీసుకుని కేసీఆర్ సభకు రావడం లేదు. సభకు రాలేని పక్షంలో ఆయనతో తక్షణమే రాజీనామా చేయించాలి. భారాస చెప్పినట్లుగా ప్రభుత్వం వినాలా? అలా వినకుంటే... మంత్రి పొంగులేటి రాజీనామా చేయాలా? రోజుకు 18 గంటలు పనిచేస్తూ 4.50 లక్షల మంది నిరుపేద దళిత, గిరిజన, బీసీలకు ఇళ్లు కట్టించి వారి కళ్లలో వెలుగు, ఇళ్లల్లో ఆనందం చూస్తున్న ఆయన రాజీనామా చేయాలా? మీ తాతలు దిగొచ్చినా అది జరగదు.

*** నాడు 3 సభాసంఘాలు వేసి ఆస్తులు గుంజుకున్నారు**

గనుల ఆదాయాన్ని పెంచి పేదలకు పంచాలనే విధానంతో ముందుకు వెళుతున్నాం. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ విషయంలో 2025లో వాస్తవ పరిస్థితులు తెలుసుకుని మైనింగ్ శాఖ పన్నులు రాబట్టుకుంది. మా ప్రభుత్వం ఇచ్చిన నోటీసును తీసుకొచ్చి భారాస వాళ్లేదో కనిపెట్టినట్లు మాట్లాడుతున్నారు. దానిపై సభాసంఘం వేయాలని డిమాండ్ చేస్తున్నారు. వాళ్ల ప్రభుత్వంలో మూడు సభా సంఘాలను వేసి బ్లాక్ మెయిల్ చేసి ఆస్తులు గుంజుకున్నారు. పార్టీ ఫిరాయింపుల్ని ప్రోత్సహించి రాజకీయ లబ్ధి పొందారు. ఇప్పుడు కూడా సభాసంఘంలో చేరి ధరణిలో ఆక్రమించిన భూములను సక్రమం చేసుకోవాలని చూస్తున్నారు. సిరిసిల్లలో కేటీఆర్ అనుచరులు ఆక్రమించిన భూములను కాపాడుకోవాలని చూస్తున్నారు.

**నిరూపించాల్సిన బాధ్యత విపక్షానిదే**

గనుల అక్రమాలపై సభాసంఘం వేసినా నివేదికను మళ్లీ ఏదో ఒక ప్రభుత్వ విచారణ సంస్థకు ఇవ్వాల్సిందే. అందుకే మేం గత 12 ఏళ్ల మైనింగ్ అక్రమాలపై నేరుగా సీబీఐ విచారణకు ఆదేశించాం. అది నా ఆధ్వర్యంలో పనిచేస్తుందనే అనుమానం ఉంటే సీబీఐకి అప్పగించాలా.. చెప్పండి. మీరు అడిగితే దానికే అప్పగిస్తాం. బ్లాక్‌మెయిల్ చేయడానికే వారు సభాసంఘం కోరుతున్నారు. పొంగులేటి బంధువుల కంపెనీని అడ్డుపెట్టుకొని ఆయన్ను బెదిరించేందుకు యత్నిస్తున్నారు. ఇక్కడ మీ పప్పులు ఉడకవు. ఇక్కడున్నది రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క. నా ముందు మీ బెదిరింపులు, ఉడత ఊపులు నడవవు. గనుల శాఖలో అక్రమాలను వెలికి తీసేందుకు చిత్తశుద్ధితో ఉన్నాం. ఆరోపణలు చేయడమే కాదు, వాటిని నిరూపించాల్సిన బాధ్యత కూడా విపక్షానిదే. ఈ వ్యవహారంలో ఎవరి ప్రమేయం ఉన్నా విడిచిపెట్టే ప్రసక్తేలేదు. హరీశ్‌రావు, కేటీఆర్, ఇతర సభ్యులకు విజ్ఞప్తి చేస్తున్నా. అలాగే భాజపా, మజ్లిస్, సీపీఐ, మా పార్టీ సభ్యులను కోరుతున్నా. తెలంగాణ ఖనిజ సంపద దోపిడీకి సంబంధించి సమాచారం అధికారులకు ఇవ్వండి. అక్రమ మైనింగ్ వ్యవహారంలో పొంగులేటి కుటుంబం, నా కుటుంబం, బంధువులు, దూరపుబంధువులు, అనుచరుల ప్రమేయం ఉందంటే భారాస నేతలు అందుకు సంబంధించిన ఆధారాలను వెంటనే సీబీఐకి సమర్పించాలి. వాటిని స్వీకరించి రసీదు ఇచ్చి విచారణ చేపడుతుంది'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

*** ఫిరాయింపుల దుష్ట సంప్రదాయాన్ని ప్రవేశపెట్టిందే కేసీఆర్**

రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపులు అనే దుష్ట సంప్రదాయాన్ని ప్రవేశపెట్టిందే కేసీఆర్. గతంలో పార్టీ ఫిరాయించినవారు, ఇప్పుడు పార్టీ ఫిరాయింపుల గురించి మాట్లాడుతున్నారు. పెద్ద స్లోగన్‌లు ఇస్తున్నారు. 2014లో పక్క పార్టీ నుంచి తీసుకుని మంత్రులను చేశారు. 2018లో కాంగ్రెస్ నుంచి గెలిచిన వారిని పార్టీలో చేర్చుకుని మంత్రులను చేశారు.

# అమెరికా అవాక్స్ ధ్వంసం

దుబాయ్: పశ్చిమాసియా యుద్ధంలో అమెరికాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరంపై ఇరాన్ శుక్రవారం జరిపిన దాడిలో అగ్రరాజ్యానికి చెందిన అత్యాధునిక నిఘా విమానం 'బోయింగ్ ఈ3 సెంట్రీ' తీవ్రంగా ధ్వంసమైంది. అమెరికా, దాని మిత్రదేశాల బలగాలకు కళ్లు, చెవుల్లా ఈ 'ఎయిర్‌బోర్న్ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టమ్(అవాక్స్)' విమానం పనిచేసేది. ఇందులోని అత్యాధునిక రాడార్ వ్యవస్థ.. విమానాలు, క్షిపణుల కదలికలను వందల కిలోమీటర్ల దూరం నుంచే పసిగట్టేది. దీన్ని కోల్పోవడం వాషింగ్టన్‌కు మింగుడుపడని విషయమే. మరోవైపు భూతల పోరుకు అమెరికా సిద్ధమవుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నవేళ యుద్ధాగ్ని మరింత ఉద్ధృతంగా విస్తరిస్తోంది! ఇరాన్‌లోని పలు విశ్వవిద్యాలయాలపై ఇజ్రాయెల్ అమెరికా వైమానిక దాడులతో విరుచుకుపడింది. ప్రతీకారంగా ఇజ్రాయెల్ యూనివర్సిటీలతో పాటు పశ్చిమాసియావ్యాప్తంగా అమెరికా విశ్వవిద్యాలయాల శాఖలపై దాడులు చేస్తామని ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్(ఐఆర్‌జీసీ) హెచ్చరించింది. శాంతిచర్చలు జరుపుతామని చెబుతూనే పశ్చిమాసియాలో అదనపు బలగాల మోహరింపు వేగాన్ని వాషింగ్టన్ పెంచుతోంది. 3,500 మంది మెరైన్లతో దాని అధునాతన ఉభయచర యుద్ధనౌక యూఎస్‌ఎస్ ట్రిపోలి ఆ ప్రాంతానికి చేరుకుంది. అమెరికా విమానవాహక నౌక యూఎస్‌ఎస్ హెచ్.డబ్ల్యు.బుష్ కూడా పశ్చిమాసియా దిశగా ప్రయాణిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ బాఘర్ ఘాలిబఫ్ వాషింగ్టన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీచేశారు. ఇరాన్ గడ్డపై అడుగుపెట్టే అమెరికా సైనికులను బుగ్గి చేసేందుకు తమ బలగాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. యుద్ధం నిలిపివేత ప్రయత్నాల్లో భాగంగా సౌదీ అరేబియా, టర్కియే, ఈజిప్టు విదేశాంగ మంత్రులు పాకిస్థాన్‌లో ఆదివారం చర్చలు జరిపారు.

# సీఐడీతో కాదు.. సిటింగ్ జడ్జితో విచారణ జరిపిద్దాం

హైదరాబాద్: ''మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అక్రమాలు బయటపడగానే.. నాపై బురద జల్లే ప్రయత్నం చేశారు. నా బావమరిది, నా తమ్ముడి పేర్లు ప్రస్తావిస్తూ మాపై ఆరోపణలు చేశారు. మా కుటుంబ సభ్యులపై చేసిన ఆరోపణలపై మేం విచారణకు సిద్ధం. మరి మీ సోదరులు, బావమరిది కుంభకోణాలపై మీరు విచారణకు రెడీనా? హౌస్‌కమిటీ, సీఐడీతో విచారణ కాదు.. హైకోర్టు సిటింగ్ జడ్జితో విచారణ చేయిద్దాం. నేను సిద్ధం.. మీరు సిద్ధమా?'' అని భారాస శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం హరీశ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ''మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారనే విషయం రాష్ట్ర ప్రజలకు అర్థమైంది. దీంతో సీఎం దృష్టి మళ్లింపు రాజకీయాలకు పాల్పడుతున్నారు. అక్రమ మైనింగ్‌పై హౌస్‌కమిటీ వేయాలని మేము డిమాండ్ చేస్తే.. మాకు మైక్ ఇవ్వకుండా దళితుల అంశాన్ని రాజకీయం చేయాలని చూశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 20 కుంభకోణాలు జరిగాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈరోజు లేఖ రాశాం. వీటిపై విచారణ చేపట్టండి. రాష్ట్రంలో భూముల లావాదేవీల్లో ముఖ్యమంత్రికి, పొంగులేటికి మధ్య ఫెవికాల్ బంధముంది. కొడంగల్, నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్ టెండర్ పొంగులేటి కంపెనీకే ఇచ్చారు. మూసీ సుందరీకరణ టెండర్ కూడా వారికే ఇస్తున్నారు. అందుకే పొంగులేటిపై హౌస్‌కమిటీ వేసే ధైర్యం సీఎంకు లేదు. వీరు చేస్తున్న భూకుంభకోణాలను త్వరలో ఆధారాలతో సహా బయటపెడతా.

# కార్యకర్తల త్యాగాలను.. జీవితాంతం గుర్తుపెట్టుకోవాలి

అమరావతి: తెదేపా అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం కార్యకర్తల త్యాగాలని, వారిని జీవితాంతం గుర్తుపెట్టుకోవాలని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు. ఇక నుంచి క్లస్టర్, యూనిట్, బూత్, జాతీయ, రాష్ట్ర, మండల, డివిజన్, గ్రామ కమిటీల్లో ఉన్నవారందరికీ ఉచితంగా పరీక్షలు చేయించి.. వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించే ఏర్పాటు (ఫాలోఅప్ కేర్) చేస్తామని చెప్పారు. కార్యకర్తలు కొందరు అలకలు వీడాలని.. కార్యకర్తలు అలిగితే రాష్ట్ర ప్రజలు నష్టపోతారని అన్నారు. 'మై టీడీపీ' యాప్‌లో సీబీఎన్ కనెక్ట్ ఆప్షన్ ద్వారా ఎవరైనా తమ అభిప్రాయాలను ముఖ్యమంత్రికి తెలపొచ్చని సూచించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో లోకేశ్ ప్రసంగించారు. 'కొన్ని రాజకీయ పార్టీలు తమ స్వార్థం కోసం కార్యకర్తల చేత కత్తి పట్టిస్తే.. చంద్రబాబు కార్యకర్తల పిల్లల చేత పుస్తకాలు పట్టించారు. ఫ్యాక్షన్ దాడుల్లో చనిపోయిన వారి పిల్లల్ని దత్తత తీసుకుని చదివిస్తున్నాం. అలా చదువుకున్న వారిలో కొందరు డెలాయిట్, గూగుల్ వంటి సంస్థల్లో పనిచేస్తున్నారు' అని చెప్పారు. యువగళం పాదయాత్రలో వారిని కలిసిన క్షణాలను గుర్తుచేసుకున్నారు. 'నా పార్టీ తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం అంటూ 44 ఏళ్ల క్రితం ఇదేరోజు ఎన్టీఆర్ గర్జించారు. పార్టీ పెట్టిన 9 నెలల్లోనే అధికారంలోకి రావడం దేశ చరిత్రలో రికార్డు' అని లోకేశ్ వివరించారు.

**జెండాలు మోసిందీ... పోరాడిందీ వారే..**

'తెదేపాను లేకుండా చేస్తామన్న వాళ్లు అడ్రస్ లేకుండా పోయారు. అర్థమైందా రాజా' అని లోకేశ్ వ్యాఖ్యానించారు. '2019 నుంచి 2024 వరకూ అరాచక పాలన చూశాం. ఆ ఐదేళ్లలో 79 మంది తెదేపా కార్యకర్తలను, నాయకులను చంపారు. అక్రమ కేసులతో వేధించారు. నాటి నుంచి నేటి వరకూ పార్టీ కంచుకోటకు కాపలా కాస్తోంది కార్యకర్తలే. జెండాలు మోసిందీ.. పోరాడిందీ వారే. వారి బాగోగులను చూడటం మన బాధ్యత. కార్యకర్తల సంక్షేమానికి ఇప్పటి వరకూ రూ.150 కోట్లు ఖర్చు చేశాం' అని తెలిపారు.

# కేరళను దోచేస్తున్న ఎల్డీఎఫ్, యూడీఎఫ్

పాలక్కాడ్: వామపక్షాల నేతృత్వంలోని ఎల్డీఎఫ్, కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యూడీఎఫ్‌లు కేరళను దోచుకుంటూ వస్తున్నాయని ప్రధాని నరేంద్రమోదీ ఆరోపించారు. భాజపా నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఏ ఒక్కరికో బీ టీం కాదని, నిజమైన ఏ టీం అని స్పష్టం చేశారు. ఈసారి ఎన్నికల్లో కేరళలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయబోయేది ఎన్డీయే అని, అవినీతిపరులు దోచుకున్న డబ్బును వసూలుచేసి రాష్ట్రాభివృద్ధికి ఖర్చుచేస్తుందని తెలిపారు. కేరళలోని పాలక్కాడ్‌లో ఆదివారం భారీస్థాయి ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ ఈ రాష్ట్రం కొన్ని దశాబ్దాలుగా స్వార్థ రాజకీయాలతో నలిగిపోతోందని చెప్పారు. కుంభకోణాల మధ్య ఎల్డీఎఫ్, యూడీఎఫ్‌లు అధికారాన్ని మార్చుకుంటూ.. జేబులు నింపుకొంటూ వచ్చాయని, ఒకదానిపై ఒకటి ఎన్నడూ చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

# కార్యకర్తే అధినేత

అమరావతి: సమర్థంగా పనిచేసేవారే రాబోయే రోజుల్లో ప్రజాప్రతినిధులవుతారని, వారికి గుర్తింపు, అన్ని రంగాల్లో రాణింపు ఉంటాయని ముఖ్యమంత్రి, తెదేపా అధినేత చంద్రబాబు కార్యకర్తలకు హామీ ఇచ్చారు. నియోజకవర్గాల పునర్విభజన కారణంగా ఈసారి 50% సీట్లు పెరిగే అవకాశం ఉందని, చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు వస్తున్నాయని చెప్పారు. క్రమశిక్షణతో పనిచేసి పార్టీని పటిష్ఠం చేయాలని, అలాంటివారిని గుర్తించే బాధ్యత లోకేశ్ తీసుకుంటారని వివరించారు. 'రాజకీయం చేస్తా.. అదే సమయంలో అభివృద్ధి, సంక్షేమం ఇస్తా' అని స్పష్టం చేశారు. తెదేపా 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సభలో చంద్రబాబు ప్రసంగించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేశ్, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పలువురు నాయకులు పాల్గొన్న కార్యక్రమంలో ప్రతికూల పరిస్థితుల్లోనూ పార్టీకి విశేషంగా సేవలందించిన 19 మంది కార్యకర్తలను చంద్రబాబు సత్కరించారు. వైకాపా ప్రభుత్వంలో తెదేపా నాయకులపై చేసిన దాడులు, అక్రమ పోలీసు కేసులు తదితర అంశాలపై వీడియో ప్రదర్శించారు. తెలంగాణ, అండమాన్, నికోబార్ దీవుల నాయకులతోనూ వర్చువల్‌గా మాట్లాడారు. అంతకుముందు కార్యాలయం ప్రాంగణంలో పార్టీ జెండాను చంద్రబాబు ఆవిష్కరించి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. 'తెదేపా బలంగా ఉంటేనే రాష్ట్రం పటిష్ఠంగా ఉంటుంది. పసుపు జెండా నిరంతరం ఎగరాలి. రాష్ట్రం ఎప్పుడూ గెలవాలి. పార్టీ బాగుంటే తెలుగుజాతి జాతీయస్థాయిలో నంబర్ వన్‌గా ఉంటుంది. అదే నా జీవితాశయం. అమరావతి వ్యతిరేక శక్తుల్ని శాశ్వతంగా అక్కడకు రాకుండా చేయాల్సిన బాధ్యత ప్రజలదే. రాజధానికి చట్టబద్ధత కల్పిస్తూ కేంద్రం తొందర్లోనే చట్టం చేస్తుంది' అని చంద్రబాబు పేర్కొన్నారు. 'గత ఎన్నికల ముందు జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో పొత్తు పెట్టుకోవడం సరైన సమయంలో సరైన నిర్ణయం. తర్వాత భాజపాతో కలిశాం. దాంతో గత ఎన్నికల్లో తెదేపా రికార్డు సృష్టించింది' అని వివరించారు. చంద్రబాబు ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

# సూపర్‌హిట్ దీదీ మోడల్!

మమతా బెనర్జీ.. పశ్చిమ బెంగాల్ ఫైర్‌బ్రాండ్. ఢీ అంటే ఢీ అనే మనస్తత్వం.. ఏ విషయంలోనూ రాజీలేని ధోరణి.. ఇది ఒకప్పటి మాట.. ఇప్పుడు.. మమత అంటే నిజంగానే ప్రజలపై మమత చూపే నేత. సంక్షేమాన్ని, ప్రజలపై శ్రద్ధ చూపడాన్ని, వారితో మమేకం కావడాన్ని పుణికిపుచ్చుకున్న నాయకురాలు.. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఆమె తీసుకున్న చర్యలు.. ప్రజలతో సంబంధాలు ఆమెను తిరుగులేని శక్తిగా మార్చాయి. అదే శక్తితో వరుసగా మూడు సార్లు విజయఢంకా మోగించారు. మరోసారి గెలిచి తనకు తిరుగులేదని నిరూపించుకోవడానికి ఆమె తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. 'దీదీ మోడల్'తో మరోసారి సూపర్ హిట్ కొట్టాలని చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె పంథా.. ప్రారంభించిన పథకాలు.. ప్రజలతో అనుసంధానమైన తీరు ఆసక్తికరం.

**గ్రామీణ ఆర్థికానికి ఊతం..**

సంక్షేమం (నగదు బదిలీ), శ్రద్ధ, నిరంతరం ప్రజలతో అనుసంధానంపై ఉండటం మమత బెనర్జీని ప్రత్యేకంగా నిలుపుతున్నాయి. ఆమె ప్రభుత్వ సంక్షేమ నిర్మాణం.. పాలనలో అత్యంత కీలక భాగంగా ఉంది. ఇందులో భారీగా సామాజిక సంక్షేమ పథకాలను రాజకీయ పరిణామాలతో అనుసంధానించడం అత్యంత ముఖ్యమైనది. 'దీదీ మోడల్' పరిపాలన అంటే కీలక సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాదు. గ్రామీణ ఆర్థికాన్ని పునర్నిర్వచించడం కూడా. ఇది ఆమె తిరుగులేని అధికారానికి ఆలంబనగా నిలిచింది.

# గల్ఫ్ దేశాలకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు..

## కష్టకాలంలో అండగా నిలిచాయని ప్రశంస

దిల్లీ, మార్చి 29: పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణంలో చిక్కుకుపోయిన భారతీయ పౌరులను సురక్షితంగా స్వదేశానికి తరలించడంలో సహాయం అందించిన గల్ఫ్ దేశాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధన్యవాదాలు తెలిపారు. కష్టకాలంలో భారతీయులకు అండగా నిలిచిన యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్, ఒమన్ దేశాల నాయకత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇరాన్ అమెరికా మధ్య ఉద్రిక్తతల కారణంగా విమాన సర్వీసులు నిలిచిపోయినప్పుడు, వేలాది మంది భారతీయులను తమ దేశాల మీదుగా స్వదేశానికి పంపేందుకు గల్ఫ్ దేశాలు చూపిన చొరవ మరువలేనిదని ప్రధాని అన్నారు. ఈ సంక్షోభ సమయంలో దుబాయ్, అబుదాబీ, మస్కట్ విమానాశ్రయాలు భారతీయుల తరలింపునకు కీలక కేంద్రాలుగా మారాయి.

# కృష్ణా తీరం.. విహంగ విహారం.. ప్రకృతి ప్రేమికులకు పండుగే

విజయవాడ: నల్లమల అటవీ ప్రాంతం ప్రకృతి, జీవవైవిధ్యానికి ప్రసిద్ధి. ఎత్తైన కొండలు, లోతైన లోయలు, విస్తరించిన పచ్చని అడవులు ఈ ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణను తీసుకువస్తోంది. పక్షుల కిలకిలారావాలు, వన్యప్రాణుల సంచారం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది. కృష్ణా నదీతీరంలో ఉన్న సోమశిల ఆలయ ప్రశాంత వాతావరణం సందర్శకులను కట్టిపడేస్తోంది. ఇక్కడి నుంచి శ్రీశైలం వరకు సాగే బోటు ప్రయాణం పర్యాటకులకు జీవితంలో మధురానుభూతిని కలిగిస్తోంది. నల్లమలలోని శ్రీశైలం పుణ్యక్షేత్రం భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు కేంద్రంగా నిలుస్తోంది. ప్రకృతి, ఆధ్యాత్మికత కలిసిన ఈ ప్రాంతం పర్యాటకులకు విభిన్న అనుభవాన్ని అందిస్తోంది. నింగిని చీల్చుకుంటూ హెలికాప్టర్‌లో నల్లమల, కృష్ణానదీ తీరం మీదుగా సాగే ఈ ప్రయాణంలో ఆ దృశ్యాలను చూడాల్సిందే తప్ప మాటల్లో చెప్పడం కష్టమే. ఎప్పటికీ మనసులో నిలిచిపోయే అద్భుత అనుభూతిని అందివ్వనుంది.

*** హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ సేవలు..**

తెలంగాణ టూరిజం, ఈజీ మై భాగస్వామ్యంతో ట్రిప్ హైదరాబాద్‌కు చెందిన ఆరాధ్య ట్రావెల్స్ సోమశిల, శ్రీశైలం వెళ్లేందుకు ప్రత్యేకంగా ఎయిర్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకువచ్చింది. తొలిసారిగా హైదరాబాద్ హెలికాప్టర్ సేవలు అందిస్తోంది. వాస్తవానికి హైదరాబాద్ నుంచి సోమశిల, శ్రీశైలం వెళ్లాలంటే కాస్త ఎక్కువ సమయమే పడుతుంది. తక్కువ సమయంలో ఆయా ప్రాంతాలను సందర్శించేందుకు వీలుగా హెలికాప్టర్ సేవలను ప్రారంభించింది. సోమశిల లలితా సోమేశ్వరుడి ఆలయంతో పాటు శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి జ్యోతిర్లింగ క్షేత్రాన్ని సందర్శించుకునేందుకు వీలుంటుంది. ఈ ప్యాకేజీలోని ఆలయాల్లో ప్రత్యేక వీఐపీ దర్శనం కల్పించనున్నారు.

# దొడ్డి కొమురయ్య ఉత్సవ కమిటీ సభ్యులుగా మరాఠీ మల్లేష్ కురుమ



మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి, వర్ధంతి వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా కమిటీని ప్రకటించింది. ఈ కమిటీలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ సర్కిల్ దేవేందర్ నగర్ కాలనీకి చెందిన మరాటి మల్లేష్ కురుమను సభ్యునిగా నియమించింది. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో దొడ్డి కొమురయ్య కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఆయన త్యాగస్ఫూర్తిని యువతకు పరిచయం చేయడం, పోరాట చరిత్రను ప్రజల్లో విస్తృతంగా చాటిచెప్పడం లక్ష్యంగా ఈ కమిటీ పనిచేయనుందని అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జయంతి, వర్ధంతి కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. మరాటి మల్లేష్ కురుమను కమిటీ సభ్యునిగా ఎంపిక చేయడం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, కురుమ సంఘం నాయకులు,సామాజిక వర్గాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు దగ్గరగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిటీలో అవకాశం కల్పించిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యలకు మరాటి మల్లేష్ కురుమ కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కమిటీ లక్ష్యాల సాధనలో కృషి చేస్తానని ఆయన వెల్లడించారు.

# ఖమ్మంలో టీఎన్టీయూసి దిమ్మ కూల్చివేత



ఖమ్మం జిల్లా , ప్రజాస్ఫూర్తి : ఖమ్మం నగరంలోని కొత్త బస్టాండ్ సమీపంలో తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగం టీఎన్టీయూసి ఏర్పాటు చేసిన దిమ్మెను ఆర్టీసీ సిబ్బంది తొలగించటం ఉద్రిక్తతలకు దారితీసింది . పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్మికులు ఏర్పాటు చేసుకున్న దిమ్మెను అకారణంగా కూల్చివేయడంపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు . బస్టాండ్ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# ఐపీఎల్ బెట్టింగ్ లకు పాల్పడితే కఠిన చర్యలు

* **మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి.**




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: ఐపీఎల్ మ్యాచ్ లను దృష్టిలో ఉంచుకొని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్.పి. ఆదేశాల మేరకు అక్రమ బెట్టింగ్ కార్యకలాపాలపై పోలీస్ శాఖ గట్టి నిఘా ఏర్పాటు చేసిందని టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. ఐపీఎల్ బెట్టింగ్ పూర్తిగా చట్టవిరుద్ధమని, బెట్టింగ్ నిర్వహించే వారితో పాటు పాల్గొనే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని, సోషల్ మీడియా, ఆన్లైన్ ప్లాట్ఫార్మ్ ల ద్వారా జరిగే బెట్టింగ్ పై కూడా నిఘా ఉంటుందని ప్రత్యేక బృందాల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఎవరైనా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిసినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రజల సహకారం పోలీస్ శాఖకు ఎంతో అవసరమని టౌన్ ఇన్స్పెక్టర్ తెలిపారు.

# నిరుపేదలకు ఇల్లు.. కాంగ్రెస్ తోనే సాధ్యం

* **1వ వార్డు కౌన్సిలర్ కొసనం రాకేష్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ పేరిట ఇల్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందని 1వ వార్డు కౌన్సిలర్ కొసనం రాకేష్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తాళ్ళసింగారం గ్రామంలో సుర్వి భావన పులి రాజు గౌడ్ దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి ఆదివారం హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నర్సింహ్మా గౌడ్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే చెల్లిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు దొనకొండ కృష్ణ, గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి మట్టపల్లి శ్రీశైలం, సుక్క నరసింహ, సుర్వి మహేష్ గౌడ్, బొంగు గణేష్ గౌడ్, సుక్క నరసింహ, సుర్వి జగత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో ఈతకు వెళ్లి ఇద్దరు బాలురు గల్లంతు



ఖమ్మం జిల్లా, ప్రజాస్ఫూర్తి : సరదాగా ఈతకు వెళ్లిన ఇద్దరు బాలురు కవరిగుంటలో గల్లంతైన ఘటన పట్టణ శివారులో విషాదం నింపింది. ఎన్టీఆర్ కాలనీకి చెందిన శివ (13), నాగసుబాబు (14), ఆదివారం మధ్యాహ్నం మెట్టల ఆంజనేయస్వామి ఆలయం వద్ద క్వారీ గుంతలో ఈతకు దిగారు . లోతు ఎక్కువగా ఉండటంతో ఇద్దరూ నీట మునిగారు . సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు.

# ఆరోగ్యానికి యోగ ఎంతో అవసరం: దేవేందర్ సాంఘ్వీ

* **యోగ సాధనకు ఏడాది పూర్తి – ఘనంగా వార్షికోత్సవ వేడుకలు**




ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్ : ఆరోగ్యకరమైన జీవితానికి యోగ ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగ సాధనను అలవాటు చేసుకోవాలని భారతీయ యోగ్ సంస్థాన్ హైదరాబాద్ ప్రతినిధి, ప్రముఖ యోగా మాస్టర్ దేవేందర్ సాంఘ్వీ తెలిపారు. చింతల్‌లోని శ్రీ సాయి కాలనీలోని యోగా హాల్‌లో చింతల్ యోగా యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగ సాధన కేంద్రం మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవేందర్ సాంఘ్వీ హాజరయ్యారు. అలాగే హనుమాన్, పోచమ్మ దేవాలయాల చైర్మన్ కన్నెకంటి లక్ష్మన్, శ్రీ హనుమాన్ అన్నప్రసాద ట్రస్ట్ చైర్మన్ కన్నెకంటి శైలజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగ సాధన ద్వారా శారీరక ఆరోగ్యం మాత్రమే కాకుండా మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగను భాగంగా చేసుకోవాలని సూచించారు. చింతల్ యోగా యూనిట్ ఇంచార్జ్ మందపాటి ఉమాపార్వతి మాట్లాడుతూ.. ప్రతిరోజు ఉదయం 5.30 నుంచి 6.30 గంటల వరకు ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే పిల్లల... ఏప్రిల్ 1 నుంచి మే 31 వరకు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ప్రత్యేక ఉచిత యోగా శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు వినియోగించుకోవాలని కోరారు. సంవత్సరం పాటు క్రమం తప్పకుండా యోగ సాధన చేస్తున్న సాధకులను ఈ సందర్భంగా సన్మానించారు. యోగ సాధకులు వివిధ యోగాసనాలను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సాధకులు సంధ్య, వాణి రెడ్డి, సుమతి, సత్యవతి, సత్య, రేఖదేవి, వకులదేవి, స్వాతి, త్రివేణి, స్రవంతి, విజయలక్ష్మి, ఈశ్వర్ సాగర్, కళ్యాణ్ రావ్ పాటిల్, రఘురామరాజు, సంతోష్, రమేష్, సింగర్ రమేష్, రమారావు, టి.వి చారి, హరీష్ నాగేశ్వర రావు, శ్రీనివాస్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్య వైశ్యులు సమాజ సేవకులు




ప్రజా స్ఫూర్తి, సూర్యాపేట : ఆర్యవైశ్యులు సమాజ సేవకులనీ, తాము జీవిస్తూనే పదిమందికి సహాయ సహకారాలు అందిస్తారని శ్రీ వాసవి సేవా సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం తెలిపారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కిరాణా ఫ్యాన్సీ భవన్ లో శ్రీ వాసవి సేవా సమితి సూర్యాపేట జిల్లా ప్రథమ సర్వసభ్య సమావేశం జిల్లా గౌరవ సలహాదారులు గోపారపు రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో శ్రీ వాసవి సేవా సమితి స్థాపించి అట్టడుగు వర్గాన ఉన్న ఆర్యవైశ్యులకు సేవలు అందిస్తుందని తెలిపారు. శ్రీ వాసవి సేవా సమితి విద్య, వైద్య పథకం కు ప్రాముఖ్యతనిస్తూ సేవలందించబోతుందని తెలిపారు. కర్మకాండ భవన్, ఉచిత మెడికల్ క్యాంపు, పేద ఆర్యవైశ్య వధువులకు పుస్తెలు మెట్టెలు అందజేయడం, పేద ఆర్యవైశ్యుల కుటుంబంలో మరణించిన వారికి దహన సంస్కార నిధి తో పాటు వేసవిలో చలివేంద్రం ఏర్పాటు, పదవ తరగతి ,ఇంటర్ లో ప్రథమ స్థానం లో నిలిచిన వారికి నగదు పురస్కారం, రక్తదాన శిబిరం ములు నిర్వహించబోతున్నట్లు తెలిపారు. త్వరలో నూతనంగా కార్యాలయం ఏర్పాటు చేయడం, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం, మహానుభావుల వర్ధంతి, జయంతి ల తో పాటు ఎన్నో ఆధ్యాత్మిక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించుటకు తీర్మానం చేసినట్లు తెలిపారు. సమాజ సేవలో ఆసక్తిగల ఆర్యవైశ్యులు సభ్యులుగా చేరి పేద ఆర్యవైశ్యులకు సేవలందించుటకు ఒక వేదికగా శ్రీ వాసవి సేవా సమితి నిలుస్తుందని తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రంగా ఉన్న చెన్నై నుండి ప్రత్యేక తెలుగు రాష్టము కొరకు ప్రాణాలను అర్పించిన పొట్టి శ్రీరాములు విగ్రహ ఏర్పాటు, యువతకు ప్రేరణ కలిగించే శివాజీ మహారాజ్ విగ్రహాన్నీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి సేవా సమితి ప్రధాన కార్యదర్శి దేవర శెట్టి నాగరాజు కోశాధికారి సోమ ప్రవీణ్ కుమార్ ఉపాధ్యక్షులు మిరియాల సుధాకర్, మహంకాళి ప్రణీత్, సహాయ కార్యదర్శి కర్నాటి కృష్ణ, కోట శివ, వీరవెల్లి విజయ శంకర్, సభ్యులు పోలా లక్ష్మీనారాయణ, సోమా ధనుంజయ్, శ్రీరంగం రాము, వందనపు వెంకటేశ్వర్లు, బెలిదే అశోక్, బుక్క రమేష్ ,బుద్ధా నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మకు "అక్షర" పరీక్ష..!

* **రంగారెడ్డి జిల్లాలో ఉత్సాహంగా "ఉల్లాస్" పరీక్షలు**
* **రంగారెడ్డి జిల్లాలో అక్షరాస్యత పెంచడమే లక్ష్యం**
* **వయోజన విద్యా కేంద్రం రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ అనిత స్పష్టీకరణ**



ప్రజా స్ఫూర్తి, షాద్నగర్ : గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన వారిలో అక్షర వెలుగులు నింపడంతో పాటు చదువు మధ్యలో ఆపేసిన వారికి విద్య అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ చేపడుతున్నాయనీ విద్యాశాఖ, సెర్ప్ ఆధ్వర్యంలో ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ సొసైటీ) పేరుతో స్వయం సహాయక సంఘాల సభ్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ప్రక్రియ రంగారెడ్డి జిల్లాలో ప్రారంభించామనీ వయోజన విద్యా కేంద్రం రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ అనిత స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో వయోజనులకు గ్రామాల్లో అక్షరాస్యతపై శిక్షణ పూర్తి చేసిన సందర్భంగా పరీక్షలను ఆదివారం ఆయా గ్రామాలలో నిర్వహించినట్లు వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనిత వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లాలోని షాద్ నగర్ నియోజక వర్గం ఫరూక్ నగర్ మండలం లింగారెడ్డిగూడెం, వెల్జర్ల, కమ్మదనం గ్రామాలతో పాటు కేశంపేట మండలం వేముల నర్వ గ్రామాల్లో నిర్వహించిన పరీక్షా కేంద్రాలను డిప్యూటీ డైరెక్టర్ అనిత స్వయంగా తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా లింగారెడ్డిగూడెం పరీక్షా కేంద్రం వద్ద సర్పంచ్ ప్రవీణ్ కుమార్ (ఎంసీ రాజు), ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ లతో ఆమె మాట్లాడారు. ఈ సెంటర్లో మొత్తం 30 మంది వయోజనులు పరీక్షలు రాసినట్లు తెలిపారు. ఏపీఎం జయ సిసి రామచంద్ర బుక్ కీపర్ మమత వీరేష్ గౌడ్ తదితరులు హాజరయ్యారు. ఇలాంటి పరీక్షల వల్ల మహిళలలో విద్యా చైతన్యం జరుగుతుందని తద్వారా సమాజం అభివృద్ధి జరుగుతుందని వైద్యన విద్యాశాఖను గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ లు అభినందించారు. అనంతరం వెలజర్ల గ్రామంలో కూడా పరీక్ష కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. కేశంపేట మండలం వేముల నర్వ, పాపిరెడ్డి గూడలో పరీక్ష కేంద్రాలను సైతం ఆమె స్వయంగా సందర్శించారు.

* **జిల్లాలో అక్షరాస్యతను పెంచుతాం..**

అనంతరం ఆమె మీడియా తో మాట్లాడుతూ ఈ మేరకు జిల్లాలోని స్వశక్తి సంఘాల్లో చదువు రాని, మధ్యలో ఆపేసిన సభ్యులను గుర్తించి వివరాలు నమోదు చేశారని వీరికి చదువు నేర్పి ఆర్థిక, డిజిటల్, అక్షరాస్యత, వాణిజ్య నైపుణ్యాలు, ఆరోగ్య సంరక్షణపై ఈ చదువుల ద్వారా అవగాహన కలిస్తారనీ ఉల్లాస్ పథకంతో అక్షరాస్యత పెంపొందుతుందనీ ఆమె వివరించారు. జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ, సెర్ప్ శాఖ సమన్వయంతో నిరక్షరాస్యులను గుర్తించాం అని ఆమె వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఉల్లాస్ పథకం ద్వారా లక్ష్యం కంటే ఎక్కువ మందికి ఇప్పటికే గుర్తించాం అన్నారు. రంగారెడ్డి జిల్లాలో 73వేల 832 మంది నిరక్షరాస్యులను గుర్తించాల్సిన లక్ష్యం ఉండగా అంతకన్నా ఎక్కువ 77,774 మందిని జిల్లావ్యాప్తంగా గుర్తించినట్లు ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం మొదటి విడతలు 38 వేల 869 మంది పరీక్షలు రాస్తున్నారని ఆమె వివరించారు. రంగారెడ్డి జిల్లాలో మొత్తం 27 మండలాలకు గాను 558 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందులో 21 గ్రామీణ మండలాలు, ఆరు అర్బన్ మండలాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మిగతా వారికి రెండవ దఫా పరీక్షలు ఏప్రిల్ 15న నిర్వహిస్తామని ఆమె స్పష్టం చేశారు. నిరక్ష రాస్యులైన మహిళలు, పురుషులు భవిష్యత్తులో చక్కని ఫలితాలు దీనితో సాధించగలుగుతారనీ ఆమె మీడియాతో ఆశాభావం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారి, డిఆర్డిఓల సహకారంతో జిల్లాలో అక్షరాస్యతను పెంచడమే తమ లక్ష్యం అన్నారు. ఆదివారం జరిగిన పరీక్షలను విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనితతో పాటు వేముల నర్వ సర్పంచ్ సువర్ణ, ఏపీఎం కవిత, సిఆర్పి పాండు, సీసీ అలివేలు, కార్యాలయ సిబ్బంది శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 1న బ్లాక్ డే




ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 1వ తేదీన బ్లాక్ డే గా పాటించనున్నట్లు కార్మిక సంఘాల నాయకులు అన్నారు. ఆదివారం కొత్తగూడెంలోని ఐఎఫ్‌టియు కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జె. సీతారామయ్య అధ్యక్షతన కార్మిక సంఘాల జేఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఆందోళన చేయాలని నిర్ణయించారు. బీజేపీ పాలకులు రద్దుచేసిన 29 కార్మిక చట్టాలు వందేళ్ల కార్మికవర్గ పోరాటాల చరిత్ర ఫలితంగా సాధించబడినవని, నేడు మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కేవలం అంబానీ, అదాని, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం తప్ప దేశ కార్మిక వర్గానికి ఎంత మాత్రం ఉపయోగం లేదని విమర్శించారు. ఏప్రిల్ 1న జరిగే బ్లాక్ డే కార్యక్రమంలో జిల్లాలోని సింగరేణి, ఆర్టీసీ, విద్యుత్, హెల్త్, నవభారత్, కెటిపిఎస్, హెవీ వాటర్ ప్లాంట్, బిపిఎల్, ఇన్సూరెన్స్, పోస్టల్, బ్యాంకు తదితర ప్రభుత్వ రంగసంస్థల ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, అవుట్ సోర్సింగ్ కార్మికులు, అసంఘటిత రంగంలో భవన నిర్మాణ, హమాలీ, స్కీంవర్కర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐఎన్‌టియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు, ఎఐటియుసి, బిఆర్‌టియు, టియుసిఐ సంఘాల నాయకులు ఎస్.ఎ.జలీల్, కే.బ్రహ్మచారి, జే.సీతారామయ్య, నగేష్, తుమ్మ శ్రీనివాస్, ఎన్.సంజీవ్, ఎస్ ఏ.నబి, మోత్కూరు మల్లికార్జున్, పి. సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే పార్టీ బలం – సంక్షేమం, బలోపేతానికి కృషి చేయాలి

* **మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ దిశానిర్దేశం**



షాద్ నగర్, (ప్రజా స్ఫూర్తి ): రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలంలోని బీ ఆర్ ఎస్ మండల అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సంక్షేమం, కార్యకర్తల అభ్యున్నతి ప్రధాన లక్ష్యాలుగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కీలకమని, గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు శక్తివంతమైన వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యకర్తల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రజలకు చేరువవుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అలాగే బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా వివరించాలని సూచించారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసి విజయపథంలో నడిపేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, సీనియర్ నాయకులు రెడ్డి నర్సింలు, రాజరామేశ్వర్ రెడ్డి, బంధులాల్, దర్గా రామచంద్రయ్య తదితరులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మట్టల ఆదివారం సందర్భంగా మానుకోటలో ఘనంగా ర్యాలీ

* **హోలీ స్పిరిట్ మినిస్ట్రీస్ పాస్టర్ అనుదీప్ అభిషేక్**




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మానుకోట పట్టణంలో ఆదివారం స్థానిక ఎల్షదాయి చర్చ్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారంను పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో ర్యాలీ నిర్వహించారు. సంఘ విశ్వాసులు అందరూ కలిసి ఈత మట్టలను సేకరించి, వాటిని పూలతో అందంగా అలంకరించి "హోసన్నా జయమే" అంటూ ఘనంగా నినాదాలు చేశారు.ఈ ర్యాలీ కోర్టు సెంటర్ నుండి ప్రారంభమై తొర్రూర్ బస్టాండ్, నెహ్రూ సెంటర్ మీదుగా కొరివి గేట్ వరకు కొనసాగింది. మార్గమధ్యంలో ప్రజలు గుమికూడిన ప్రాంతాల్లో చర్చి పాస్టర్ అనుదీప్ సువార్త బోధిస్తూ, యేసు క్రీస్తు మహిమను వివరించారు. మానవ పాప పరిహారార్థం కన్యక గర్భంలో జన్మించి, పాపరహిత జీవనానికి ఆదర్శంగా నిలిచారని ఆయన పేర్కొన్నారు.అనంతరం ప్రజలందరి క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అభిషేక్, ఎస్తేరు, జయశ్రీ,, ఉదయశ్రీ, స్టీఫెన్, డాక్టర్ రవికుమార్, భరత్, ప్రవీణ్, యోసేపు, శాంతి, రూతమ్మ, నిర్మల, లలిత, నిహారిక, యేసుపుష్ప, సరోజ, ఎస్తేరు సుభద్ర, వరప్రసాద్, లావణ్య, ఐజక్, శామ్యూల్, ఏసుమణి, కీర్తన, సంజన, కృష్ణమనోహర్, శ్యాంకిషోర్, రమేష్, వనిత, మత్తయి, పేతురు, మరియమ్మ, ప్రియ, నిస్సీ, జోసెఫ్, సుకన్య, వంశీ పాల్ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా దివంగత కుర్ర మహేష్ సంతాప సభ



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: కాళోజీ వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు,దివంగత కామ్రేడ్ కుర్ర మహేష్ సంస్మరణ సభ పిల్లి సుధాకర్ అధ్యక్షతన గుమ్ముడూరులో మార్చి, 29, 2026 న నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా కాళోజీ వాకర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ డోలి సత్యనారాయణ, ముఖ్య సలహాదారులు మైసా శ్రీనివాస్ మాట్లాడుతూ కుర్ర మహేష్ మా వాకర్ అసోసియేషన్ లో కార్యవర్గ సభ్యులుగా ఉంటూ, అకాల మరణం చెందినందున వారి యొక్క కుటుంబానికి సహకారంగా వాకర్ మిత్రులందరూ సహకరించి 50 కిలోల బియ్యంతో పాటు 1,20,500 రూపాయలను ఆర్థిక సహకారాన్ని అందజేయడం జరిగినది. ఈ మొత్తాన్ని వారి కుటుంబానికి ఆదివారం అందజేసినాము. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి పట్టాభి లక్ష్మయ్య, కోశాధికారి సోమ విష్ణువర్ధన్, పాశం మల్లారెడ్డి, తోడేటి వెంకన్న, పెద్ది వెంకన్న, గోనే శ్యామ్ రావు, నేతుల వెంకన్న, భూర్ల ప్రభాకర్, శ్యామల శ్రీనివాస్ రెడ్డి, బొప్పిడి శ్రీనివాస్ రెడ్డి, గూడూరు నాగేశ్వరరావు, మెంతుల శ్రీనివాస్, కాసాని రమేష్, గుడి బోయిన వెంకటేశ్వర్లు, నరసింహారావు, కిషన్, కుమ్మరికుంట నాగన్న, వేముల రవీందర్, కొడెం శ్రీనివాస్, రేఖ దేవేందర్, దేశవేయన రవి, తదితరులు పాల్గొన్నారు.

# నేడు సింగరేణి హెడ్ ఆఫీస్ ముట్టడి

**– ముగియనున్న ప్రచార జాత.. హాజరుకానున్న నారాయణ, కూనంనేని**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి) ఆధ్వర్యంలో సోమవారం కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నారు. సేవ్ సింగరేణి పేరిట గుర్తింపు సంఘం కార్మిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ నెల 18న మంచిర్యాల జిల్లా బెల్లంపెల్లి ఏరియాలోని గోలెటి నుండి ప్రచార జాత ప్రారంభించగా, కొత్తగూడెంలో ముగియనుంది. ఈ సందర్భంగా సింగరేణి ప్రధాన కార్యాలయ ముట్టిడితో పాటు భారీ ధర్నా నిర్వహించనున్నారు. తొలుత యూనియన్ కార్యాలయం నుండి ప్రదర్శనగా బయలుదేరి బస్టాండ్ సెంటర్, పోస్టాఫీస్ సెంటర్ మీదుగా సింగరేణి ప్రధాన కార్యాలయానికి పెద్ద ఎత్తున కార్మికులు చేరుకోనున్నారు. ఈ ధర్నాలో సిపిఐ జాతీయ కంట్రోల్ కమీషన్ చైర్మన్ డా. కే నారాయణతోపాటు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ ఏ కూనంనేని సాంబశివరావు హాజరుకానున్నారు. వీరితోపాటు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, సింగరేణి కాలరీస్ వర్కర్స్ గుర్తింపు యూనియ్ గౌరవ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ తదితరులు పాల్గొననున్నారు.

# విజ్ఞాన్ జ్యోతి హై స్కూల్ ఫోకస్ ప్రారంభం

*** ప్రారంభించిన ఎస్ ఆర్ జోనల్ ఇన్చార్జ్ దోనాల శ్రీనివాస్ రెడ్డి..**

నల్లగొండ, ప్రజాస్ఫూర్తి.నల్గొండఎస్ ఆర్ ప్రైమ్ స్కూల్ కరికులం తో ఫోకస్ బ్రాంచ్ నల్గొండ పట్టణంలోని రామగిరి పద్మజ్యోతి కాంప్లెక్స్ లో ఆదివారం విజ్ఞాన్ జ్యోతి హై స్కూల్ ఫోకస్ బ్రాంచ్ ని ఉమ్మడి నల్గొండ జిల్లా ఎస్ఆర్ జోనల్ ఇన్చార్జ్ దోనాల శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ ప్రారంభానికి నల్గొండ పట్టణంతో పాటు జిల్లాలో నలుమూలల నుండి వేల సంఖ్యలో విద్యార్థులు తల్లిదండ్రులు హాజరయ్యారు . ఈ సందర్భంగావిద్యార్థులు తల్లిదండ్రులు కు ఏర్పాటు చేసిన సమావేశం లో ఎస్ ఆర్ జోనల్ ఇంచార్జ్ ధోనాల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రానున్న కాలంలో విద్యావ్యవస్థ బలోపేతం లో భాగంగా ప్రతి విద్యార్థి నాయకత్వం పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి అవసరమైన అన్ని విధానాలను విద్యార్థులకు సమకూర్చి విలువల తో కూడిన విద్యా అందిచడం ఫోకస్ బ్యాచ్ ముఖ్య ఉద్దేశమని, భవిష్యత్తు లో ఉన్న విద్యా వ్యవస్థ పోటీని దృష్టిలో ఉంచుకొని ఇప్పుడు నూతనంగా మన నల్లగొండలో ఫోకస్ విద్యా సంస్థను ప్రారంభించి విద్యార్థిని విద్యార్థులను ప్రోత్సహించడం తో పాటు విద్యార్థులలో మేధాశక్తిని మెరుగుపరిచేందుకు ఫోకస్ కరిక్యులం బోధన ఎంతో అవసరం ఉంటుందని తెలిపారు. నల్గొండ పట్టణంలో మొట్టమొదటగా జేఈఈ, మెయిన్స్, అడ్వాన్స్, మరియు నీట్ పరీక్ష లలో వున్నత్ స్థాయిలో శిక్షణ ఇచ్చి పోటీ పరీక్షలలో నల్గొండ విద్యార్థులని ముందు వరుసలో నిలబెట్టే విధంగా ఎస్ ఆర్ కరికులం



విజ్ఞాన్ జ్యోతి ఫోకస్ హై స్కూల్ ఉంటుందని ఎస్ ఆర్ ఇన్చార్జి దోనాల శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ ఆర్ విద్యాసంస్థల చైర్మెన్. ఎనగందుల వరదారెడ్డి ,డైరెక్టర్ సంతోష్ రెడ్డి , సీ ఈ ఓ సురేందర్ రెడ్డి లు నల్గొండలో నూతన ఫోకస్ బ్రాంచ్ హై స్కూల్ ఏర్పాటు కావడం పట్ల అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మజ్యోతి కాంప్లెక్స్ చైర్మన్ మిరియాలయాదగిరి తో పాటు ఎస్ ఆర్ కాలేజ్ స్కూల్ ప్రిన్సిపల్స్ , ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.ఎస్ ఆర్ కాలేజ్ స్కూల్ ప్రిన్సిపల్స్ , ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది ఎస్ ఆర్ కాలేజ్ స్కూల్ ప్రిన్సిపల్స్ , ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఐజేయూ ఉపాధ్యక్షులుగా వై. నరేందర్ రెడ్డి ఎన్నిక

*** కార్యవర్గ సభ్యులుగా కే. సత్యనారాయణ, నగునూరి శేఖర్**

విజయవాడ, ప్రజాస్ఫూర్తి : ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ ( ఐజేయూ) జాతీయ కార్యవర్గానికి ఆదివారం నాడు జరిగిన ఎన్నికల్లో తెలంగాణ నుంచి నలుగురు ఎన్నికయ్యారు. వై. నరేందర్ రెడ్డి ఉపాధ్యక్షులుగా ఎన్నిక కాగా జాతీయ కార్యవర్గ సభ్యులుగా కే. సత్యనారాయణ, నగునూరి శేఖర్, అజిత ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎన్నికైన నరేందర్ రెడ్డి గతంలో మూడు విడతలు కార్యదర్శిగా ఉన్నారు. అంతకు ముందు అయన ఉమ్మడి అంధ్ర ప్రదేశ్ లో ఏపీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శిగా ఎనిమిదేళ్లు పని చేశారు. కే సత్యనారాయణ గతంలో మూడు పర్యాయాలు జాతీయ కార్యవర్గ సభ్యునిగాను అంతకుముందు ఏపీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి గాను పనిచేశారు. అలాగే నగునూరి శేఖర్ కూడా గతంలో జాతీయ కార్యవర్గ సభ్యులు గాను




రెండు పర్యాయాలు టియుడబ్ల్యూజే అధ్యక్షులు గాను పనిచేశారు. అజిత కూడా గతంలో ఏపీయూడబ్ల్యూజే కార్యవర్గ సభ్యురాలిగా పనిచేశారు.

# ఐపీఎల్ చరిత్రలో.. తొలి బ్యాటర్‌గా విరాట్ కోహ్లీ రికార్డు

ఐపీఎల్ 2026 సీజన్ తొలి మ్యాచ్‌లోనే విరాట్ కోహ్లీ హాఫ్ సెంచరీ సాధించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. 202 పరుగుల లక్ష్య ఛేదనలో 69 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఈ క్రమంలో విరాట్ ఓ అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలోనే తొలి బ్యాటర్‌గా అవతరించాడు. ఛేదనలో 4వేలకుపైగా పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఇక టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన ఆరో బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. ఈ క్రమంలో పాకిస్థాన్ ఆటగాడు షోయబ్ మాలిక్‌ను కోహ్లీ అధిగమించాడు. మాలిక్ 557 మ్యాచుల్లో 13,571 పరుగులు చేయగా.. విరాట్ 415 మ్యాచుల్లోనే 13,612 పరుగులు సాధించాడు.

# ఉచిత ల్యాప్‌టాప్‌లు.. మహిళలకు రూ.8 వేల కూపన్లు DMK మేనిఫెస్టో

తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధాన పార్టీలు ఎన్నికల హామీలను విడుదల చేసే పనిలో నిమగ్నమయ్యాయి. తాజాగా డీఎంకే కూడా ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి వరకు అల్పాహార పథకాన్ని కొనసాగించడంతోపాటు మహిళలకు అందించే ఆర్థిక సాయాన్ని రూ.2వేలకు పెంచుతామని ప్రకటించింది. రైతులకు ఉచితంగా మీటరులేని అధునాతన పంపు సెట్లు, యువతకు ఉచిత ల్యాప్‌టాప్‌లు, ఆరోగ్య బీమా రూ.10 లక్షల వరకు పెంపు, ఐదేళ్లలో 10 లక్షల ఇళ్లు నిర్మాణం, తదితర హామీలను మేనిఫెస్టోలో పేర్కొంది.



- కుటుంబంలో మహిళా పెద్దకు ఇస్తున్న ఆర్థిక సాయం రూ.వెయ్యి నుంచి రూ.2వేలకు పెంపు
- వృద్ధాప్య పింఛను రూ.2వేలకు పెంపు
- పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం కొనసాగింపు (ప్రస్తుతం ఐదో తరగతి వరకు ఉండగా.. ఎనిమిదో తరగతి వరకు అమలు)
- యువతకు ఉచిత ల్యాప్‌టాప్‌లు (దాదాపు 35 లక్షల మందికి ప్రయోజనం)
- రైతులకు ఉచితంగా మీటరు లేని మోటార్లు
- వచ్చే ఐదేళ్లలో 10లక్షల కొత్త ఇళ్ల నిర్మాణం
- ఆరోగ్య బీమా పథకం వార్షికాదాయ పరిమితి రూ.5లక్షలకు పెంపు, రూ.10లక్షల ఆరోగ్య బీమా
- ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థినులకు ఇస్తున్న ఆర్థిక సాయం రూ.1500లకు పెంపు
- మహిళలకు రూ.8000 విలువైన కూపన్ (టీవీ వంటి గృహోపకరణాలు కొనుక్కోవడం లేదా మార్చుకోవడానికి) వంటి హామీలను ప్రకటించారు.

# ఎగ్జిట్ డోర్ తెరిచేందుకు ప్రయత్నించిన ఇండిగో ప్రయాణికుడు

ఇండిగో విమానంలో ఓ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. విమానం గాల్లో ఉండగా ఓ ప్రయాణికుడి వింత చేష్టలు తోటి ప్రయాణికులను కలవరపాటుకు గురిచేశాయి. ఎమర్జెన్సీ ఎగ్జిట్‌ను తెరిచేందుకు ప్రయత్నించడంతో ఆందోళన వాతావరణం నెలకొంది. దీంతో అతడిపై అధికారులు కేసు నమోదు చేశారు. బెంగళూరు నుంచి వారణాసికి 6E185 ఇండిగో విమానం శనివారం బయలుదేరింది. టేకాఫ్ అయిన 15 నిమిషాలకే ఉత్తర్‌ప్రదేశ్‌కి చెందిన మహమ్మద్ అద్నాన్ అనే ప్రయాణికుడు




వింతగా ప్రవర్తించడం ప్రారంభించాడు. విమానం గాల్లో ఉండగానే ఎమర్జెన్సీ డోర్‌ను తెరిచేందుకు ప్రయత్నించాడు. అప్రమత్తమైన విమాన సిబ్బంది అతడిని మందలించారు. అయినప్పటికీ ల్యాండింగ్‌కు కొన్ని నిమిషాల ముందు మరోసారి తన చేష్టలతో గందోరగళం సృష్టించాడు. విమానం 500 అడుగుల ఎత్తులో ఉండగా ఎమర్జెన్సీ ఎగ్జిట్‌ను మళ్లీ తెరిచేందుకు ప్రయత్నించాడు. సిబ్బంది పైలట్‌కు సమాచారం అందించారు. భద్రత చర్యల్లో భాగంగా పైలట్ ల్యాండింగ్ నిలిపివేసి విమానాన్ని గాల్లోనే తిప్పారు. అనంతరం సురక్షితంగా వారణాసిలో ల్యాండ్ చేశారు. దీంతో ప్రయాణికులంతా ఊపిరిపీల్చుకున్నారు. ఆ తర్వాత నిందితుడిని భద్రతా సిబ్బందికి అప్పగించారు. పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. ఆ సమయంలో తాను ఎందుకు అలా చేశానో తెలీదని, దెయ్యం ఆవహించిందంటూ నిందితుడు చెప్పడం గమనార్హం.

# మినాబ్ పాఠశాల దాడికి కారకులు వీరే: ఇరాన్

ఇరాన్‌లోని ఓ పాఠశాలపై అమెరికా జరిపిన క్షిపణి దాడి అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటనలో అభం శుభం తెలీని చిన్నారులు పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. తాజాగా ఈ క్షిపణిని ప్రయోగించిన అమెరికా నౌకాదళ అధికారుల ఫొటోలను ఇరాన్ విడుదల చేసింది. చిన్నారుల మృతికి బాధ్యులు వీరేనంటూ ఎక్స్ వేదికగా పేర్కొంది. ఫిబ్రవరి 28న ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (IRGC) స్థావరాలపై దాడులు చేస్తుండగా మినాబ్‌లోని ఓ పాఠశాలను అమెరికాకు చెందిన తొమహాక్ క్షిపణి తాకింది. ఈ ఘటనలో 160 మందికి పైగా చిన్నారులు, 14 మంది టీచర్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలోనే భారత్, దక్షిణాఫ్రికా, నైజీరియాలోని ఇరానియన్ రాయబార కార్యాలయాలు వీరి ఫొటోలను విడుదల చేశాయి. అమెరికా యుద్ధనౌక ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జెఫ్రీ యూ యార్క్, కమాండింగ్ ఆఫీసర్ లీ ఆర్ టేట్ ఫొటోలను ఎక్స్ వేదికగా పంచుకున్నాయి. "ఈ ఇద్దరు క్రిమినల్స్‌ను గుర్తుంచుకోండి. మూడుసార్లు తొమహాక్ క్షిపణిని ప్రయోగించారు. 168 చిన్నారుల



మృతికి కారణమయ్యారు'' అంటూ ఆయా రాయబార కార్యాలయాలు పేర్కొన్నాయి.

# అంతరిక్షంలో ఎత్తు పెరిగా..

# ఆకలి లేదు - శుభాంశు శుక్లా


తిరువనంతపురం: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించిన తొలి భారతీయుడిగా ఘనత సాధించిన శుభాంశు శుక్లా.. శరీరంలో మార్పులకు సంబంధించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. తిరువనంతపురంలోని ఓ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ముచ్చటించిన ఆయన.. అంతరిక్షంలో తాను స్వల్పంగా ఎత్తు పెరిగానని అన్నారు. అక్కడ ఆకలి కూడా అనిపించలేదని చెప్పారు. పైలట్‌గా సుదీర్ఘ అనుభవం, అంతరిక్ష యాత్రకు పూర్తి స్థాయిలో సన్నద్ధమైనప్పటికీ.. ప్రయోగం ప్రారంభమయ్యే సమయంలో ప్రశ్నపత్రం అందుకున్న విద్యార్థిగా అనిపించిందన్నారు. క్షణంపాటు అంతా శూన్యంగా అనిపించిందని చెప్పారు. అంతరిక్షయానం గురించి ముందుగానే అన్ని విషయాలు తెలుసుకున్నప్పటికీ, వాస్తవ అనుభవాలను మాటల్లో చెప్పలేమని అన్నారు.



అంతరిక్షం నుంచి భూమిని చూసినప్పుడు.. భూమి మొత్తం ఓ ఇల్లుగా అనిపించిందన్నారు. అంతరిక్ష పరిశోధనల్లో భారత్ ఎంతో పురోగతి సాధించిందని.. విద్యార్థులకు గొప్ప అవకాశాలు కల్పిస్తోందన్నారు.

# టీమ్ ఇండియాను చూసి మనం గర్వించాలి : ప్రధాని

టీమ్ ఇండియాను చూసి ప్రజలు గర్వించాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 132వ మన్‌కీ బాత్ ఎపిసోడ్‌లో భారత పురుషుల క్రికెట్ జట్టును ప్రశంసించారు. భారత్ ప్రపంచకప్‌ను అందుకున్న వేళ భారత్ మొత్తం సంతోషం వెల్లువెత్తిందన్నారు. వివిధ పోటీల్లో భారత క్రీడాకారులు సాధించిన



విజయాలను ప్రధాని ప్రస్తావించారు. లాంగ్ డిస్టెన్స్ రన్నర్ గుల్వీర్ సింగ్ న్యూయార్క్ హాఫ్ మారథాన్ రన్నింగ్‌లో మూడో స్థానంలో నిలవడాన్ని ఆయన అభినందించారు. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన గుల్వీర్ చరిత్ర సృష్టించాడని ప్రధాని పేర్కొన్నారు. ఇక స్క్వాష్ క్రీడాకారిణి అనాహత్‌సింగ్ ది స్క్వాష్ ఆన్ ఫైర్ ఓపెన్ 2026 విజయాన్ని అభినందించారు. అద్భుతమైన ప్రతిభతో ఇంగ్లాండ్ టాప్‌సీడ్ ప్లేయర్ జార్జినా కెన్నెడీని ఓడించి టైటిల్‌ను కైవశం చేసుకోవడాన్ని కొనియాడారు. పీఎస్ఏ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో టాప్20లో చేరిన అతిపిన్న ఆసియా క్రీడాకారిణిగా నిలిచారన్నారు.

# గుర్తింపులేని పార్టీలకు ఉమ్మడి గుర్తు కేటాయింపు నిబంధనల్లో సవరణ


ఢిల్లీ: గతంలో పోటీచేసిన ఎన్నికల్లో 1% కంటే తక్కువ ఓట్లు వచ్చిన పార్టీలకూ తాజా ఎన్నికల్లో కామన్ సింబల్ కేటాయించే అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. ఈమేరకు ఎన్నికల గుర్తుల (రిజర్వేషన్లు, కేటాయింపు) ఉత్తర్వులు 1968లోని పేరాగ్రాఫ్ 10(బి)కి సవరణలు చేస్తూ నోటిఫికేషన్ జారీచేసింది. ఇప్పటివరకూ గుర్తింపులేని రాజకీయ పార్టీల అభ్యర్థులకు




కామన్ సింబల్ కేటాయించాలంటే ఆ పార్టీ క్రితం ఎన్నికల్లో కనీసం 1% ఓట్లు సంపాదించాలన్న నిబంధన ఉండేది. ఇప్పుడు దాన్ని సవరించి క్రితంసారి జరిగిన రెండు ఎన్నికల్లో ఏదో ఒకదాంట్లో 1%లోపు పొందితే చాలు, ఉమ్మడి సింబల్ కేటాయించొచ్చని పేర్కొంది. అంటే గత ఎన్నికల్లో 1%ఓట్లు రాకపోయినా దానికంటే ముందు జరిగిన ఎన్నికలో వచ్చి ఉంటే ఉమ్మడి గుర్తు కేటాయించడానికి తాజా సవరణ వీలు కల్పిస్తోంది.

# సరుకులు, ఇంటర్నెట్ కోసం.. ఇరాక్‌లోకి ఇరాన్ పౌరులు!

అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న దాడులతో ఇరాన్ పౌరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడం, వాణిజ్యం స్తంభించడం వంటివి సర్వసాధారణంగా మారిపోయాయని స్థానికులు వాపోతున్నారు. ఈ క్రమంలో కొంత మంది ఇరానీయులు షాలమ్చే సరిహద్దు ద్వారా దక్షిణ ఇరాక్‌లోకి ప్రవేశిస్తున్నారు. తక్కువ ధరకు లభించే సరకులు, ఇంటర్నెట్ కోసం వెళ్లడం గమనార్హం. కొన్ని రోజులుగా నిరంతర వైమానిక దాడులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఇరాన్ పౌరులు చెబుతున్నారు. పేలుడు శబ్దాలకు ఇళ్లు ధ్వంసం కావడంతోపాటు తమ పిల్లలు భయాందోళనలకు గురవుతున్నారని స్థానిక మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యవసరాల ధరలు పెరగడంతోపాటు జీవన పరిస్థితులు క్షీణిస్తున్నాయని వాపోతున్నారు. ఇరుదేశాల సరిహద్దు మార్గాల్లో ఇటీవల రాకపోకలు గణనీయంగా తగ్గినప్పటికీ.. కొంతమంది ఇరానీయులు ఇరాక్‌లోకి వెళ్తున్నారు. ఎక్కువ మంది బస్రాలోని షాలమ్చే క్రాసింగ్ నుంచి ప్రవేశిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. చౌక ధరల్లో సరుకులు లభించడం, ఇంటర్నెట్ సదుపాయంతోపాటు బంధువుల ఇళ్లకు వెళ్తున్న వీరు.. తిరిగి ఇరాన్‌లోని అబుదాన్, అహ్వాజ్ నగరాలకు చేరుకుంటున్నారు. యుద్ధాన్ని త్వరగా



ముగించాలని అమెరికాను కోరుతూనే.. తాము మాత్రం తమ దేశాన్ని విడిచిపెట్టబోమని స్పష్టం చేస్తున్నారు.

# ట్రంప్ చర్చలు అంటూనే.. దాడులకు సిద్ధం: ఇరాన్ పార్లమెంట్ స్పీకర్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పైకి మాత్రం చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు నటిస్తూనే.. రహస్యంగా భూతల దాడులకు సన్నాహాలు చేస్తున్నారని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘేర్ గాలిబఫ్ ఆరోపించారు. అయితే.. తమ దళాలు వారి రాకకోసం ఎదురు చూస్తున్నాయని.. అమెరికా దళాలు అడుగుపెట్టగానే వారిని బూడిద చేస్తామంటూ హెచ్చరించారు. అమెరికా.. దాని ప్రాంతీయ మిత్ర దేశాలను దండిస్తామని హెచ్చరించారు. అమెరికాకు చెందిన 3,500 మంది మెరైన్లు నేడు సెంట్రల్ కమాండ్ పరిధిలోకి చేరుకొన్నారు. దీంతో ఇరాన్‌కు అత్యంత కీలకమైన ఖర్గ్ ద్వీపాన్ని అమెరికా స్వాధీనం చేసుకొంటుందన్న ప్రచారం జోరందుకొంది. ఈ నేపథ్యంలో ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ స్పందించారు.

**పరిహారం.. హర్మూజ్‌పై అధికారం ఇవ్వాల్సిందే: ఇరాన్**

మరోవైపు ఇరాన్‌ప్రభుత్వ ప్రతినిధి ఫాతేమ్ మొహజిరానీ కూడా చర్చలపై స్పందించారు. తాము యుద్ధం మొదలుపెట్టలేదని.. ఇప్పుడు తీవ్రంగా నష్టపోతున్న దేశం కూడా తమదే అని వెల్లడించారు. ఏ చర్చల్లో అయినా నష్టపరిహారం అంశం కచ్చితంగా ఉండాల్సిందేనని తేల్చిచెప్పారు. ఇక హర్మూజ్ జలసంధిపై తమ నియంత్రణ, ఆంక్షల తొలగింపు వంటివి కూడా చర్చల్లో కీలక విషయాలని వెల్లడించారు. సుస్థిర శాంతి కోసం అడుగులు వేస్తామన్నారు. ఆదివారం ఉదయం కూడా టెహ్రాన్‌పై భారీ స్థాయిలో బాంబింగ్ కొనసాగింది. ఈ విషయాన్ని ఫార్స్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. దీనిలో తమ పౌరులు గాయపడినట్లు వెల్లడించింది. అయితే .. ఇజ్రాయెల్ మాత్రం తాత్కాలిక కమాండ్ సెంటర్, ఆయుధ తయారీ కేంద్రంపై దాడులు జరిగినట్లు వెల్లడించింది.



# వీళ్లు జామపండు తిన్నారో.. అంతే సంగతులు

చలికాలంలో జామపండు తింటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉండగా దీన్ని పేదవాడి యాపిల్ అని పిలుస్తుంటారు. జామపండులో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. దీనితో ఇమ్యూనిటీ పవర్ ఎక్కువగా పెరుగుతుంది. డైటరీ ఫైబర్ అధికంగా ఉండి మలబద్ధక సమస్యతో బాధపడేవారికి చాలా బాగా ఉపయోగపడుతుంది. జామపండు తినడం వల్ల రక్తపోటు తగ్గడంతో పాటు గుండె ఆరోగ్యం, మెరుగ్గా ఉంటుంది. జామపండులో ఉండే విటమిన్ ఎ వల్ల కంటి ఆరోగ్యం బాగవుతుంది. చలికాలంలో జామకాయ తినడం వల్ల శరీరానికి విటమిన్ డి అందుతుంది. ఇలా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాప్పటికీ కొందరు జామపండుకి దూరంగా ఉండాలి.

జామపండుపై ఉండే రసాయనాలు అలెర్జీ సమస్యల్ని కలిగిస్తాయి. అలర్జీ సమస్యలతో బాధపడేవారు చర్మ వ్యాధులు, శ్వాసకోస వ్యాధులతో బాధపడేవారు జామపండును ఎక్కువగా తినకూడదు. ఒక వేళ తింటే వారికి చర్మంపై దద్దుర్లు, మంట, వాపు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి వారు జామపండును మితంగా తీసుకుంటే మంచిదని చెబుతున్నారు. జీర్ణక్రియ బలహీనంగా ఉన్నవారు జామపండును ఎక్కువగా తినకూడదు. జామపండు జీర్ణమవ్వడానికి ఎక్కువ సమయం తీసుకుంటుంది.

గ్యాస్ట్రిక్, ఎసిడీటీ వంటి సమస్యలు ఉన్నవారు జామపండును ఎక్కువగా తినకూడదు. ఎక్కువ తినడం వల్ల కడుపు నొప్పి, ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు వచ్చే ప్రమాదముంది. 100 గ్రాముల జామపండులో 9 గ్రాముల సహజ చక్కెర ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీంతో.. ఈ పండు ఎక్కువగా తినడం వల్ల రక్తంలో షుగర్ లెవల్స్ పెరిగే ప్రమాదముంది



# ఈ లక్షణాలు ఉంటే కిడ్నీ క్యాన్సర్


**ప్రపంచవ్యాప్తంగా కిడ్నీ క్యాన్సర్ వేగంగా పెరుగుతోంది. కిడ్నీలో ఉండే అనారోగ్యకరమైన కణాలు పెరగడం, కణితి రూపంలో ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యాధి ఏ వయస్సులోనైనా రావొచ్చు. స్త్రీల కంటే పురుషులకు కిడ్నీ క్యాన్సర్ వచ్చే అవకాశం రెండింతలు ఎక్కువగా ఉంటుంది.**

ప్రారంభ దశలలో మూత్రపిండ క్యాన్సర్ లక్షణాలు కనిపించవు. అధిక రక్తపోటు, వాంతులు, జ్వరం, ఆకలి నష్టం, వికారం, రక్తహీనత దీని లక్షణాలుగా ఉంటాయి. ధూమపానం చేసేవారిలో కిడ్నీ క్యాన్సర్ ముప్పు ఎక్కువగా ఉంటుంది. అధిక బరువు లేదా ఊబకాయం ఉన్నవారిలో కిడ్నీ క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. అధిక రక్తపోటు మూత్రపిండాల క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది. మీ కుటుంబంలో ఎవరికైనా కిడ్నీ క్యాన్సర్ ఉంటే, మీ రిస్క్ కూడా పెరుగుతుంది. పాలీసిస్టిక్ కిడ్నీ వ్యాధి వంటి కొన్ని రకాల కిడ్నీ వ్యాధి కిడ్నీ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది. కాడ్మియం, ట్రైక్లోరెథిలిన్ వంటి కొన్ని రసాయనాలు కిడ్నీ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. వ్యాయామం చేయకుండా బరువు కోల్పోతే కిడ్నీ క్యాన్సర్ కు దారి తీయొచ్చు. . ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం ద్వారా ఈ సమస్యను తగ్గించుకోవచ్చు. రోజు వ్యాయామం చేయడం వల్ల శరీరాన్ని అనేక వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చు. అలంటి సమస్య ఏర్పడితే, వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

# యోగాసనాలతో చాతీలో మంటకు చెక్

**గ్యాస్, అసిడిటీ కారణంగా చాలా మందికి చాతిలో మంట వస్తూ ఉంటుంది. దీన్ని పసిగట్టకపోతే గుండె సంబంధిత సమస్యలు రావచ్చు. ఛాతీలో నొప్పి మందుల ద్వారానే కాకుండా యోగాసనాల ద్వారా కూడా నయం చేసుకోవచ్చు. కానీ యోగా ట్రైనర్ తో యోగాసచ చే చ చ చ బాగుంటుంది.**

**ముఖ్యంగా జంక్ ఫుడ్స్ తినడం మానేయాలి. రోజూ వ్యాయామం, యోగాసనాలు చేయాలి. ముఖ్యంగా మసాల వస్తువులు తినకుండా ఉండి మంచిది. పీచు పదార్థాలు తినడం వల్ల జీర్ణవ్యవస్థ బాగా పనిచేస్తుంది. దీనికి తోడు యోగా చేయడం చాలాబాగా ఉపయోగపడుతుంది.**






**అనారోగ్యకరమైన ఆహారం తినడం వల్ల ఛాతీలో మంట ఎక్కువగా వస్తుంది. అశ్రద్ధ చేస్తే రక్త పోటుగా మారవచ్చు. ఛాతీలో మంటగా ఉంటే మందులు వేసుకోకుండా యోగాసనాలు చేయడం చాలా వరకు మంచిది.**



**అదోముఖ శవాసనం వేయడం వల్ల ఛాతీలో మంటను తగ్గించుకోవచ్చు. ఈ ఆసనం వేయడం కూడా చాలా సింపుల్. జీర్ణ సంబంధిత సమస్యలు కూడా కంట్రోల్ అవుతాయి. దీంతో ఛాతీలో మంట తగ్గుతుంది. బాలాసనం వేయడం వల్ల ఛాతీలో వచ్చే మంట తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థ క్లియర్‌గా ఉండేలా చూసుకోవాలి. బాలాసనం వేయడం వల్ల జీర్ణ వ్యవస్థ చక్కగా పనిచేస్తుంది. దీంతో చాతీలో మంట తగ్గే అవకాశం ఉంటుంది.**



## భారత్‌లో ఐఫోన్ ప్రియులకు షాక్..

### పెరగనున్న పాత మోడళ్ల ధరలు!



**న్యూఢిల్లీ:** భారత్‌లో ఐఫోన్ కొనాలనుకునే వారికి ఇది కొంత నిరాశ కలిగించే వార్త. టెక్ దిగ్గజం యాపిల్ తీసుకున్న ఒక కీలక నిర్ణయంతో పాత ఐఫోన్ మోడళ్ల ధరలు పెరగనున్నాయి. రిటైలర్లకు అందిస్తున్న ప్రోత్సాహకాలను నిలిపివేయడంతో, వినియోగదారులు ఐఫోన్ 14, 15 వంటి పాత సిరీస్ మోడళ్లపై సుమారు రూ.5,000 వరకు అదనంగా చెల్లించాల్సి రావచ్చు.

ఇంతకాలం యాపిల్ తన ఆఫ్‌లైన్ రిటైల్ భాగస్వాములకు డిమాండ్ జనరేషన్ (డీజీ) సపోర్ట్ పేరుతో కొన్ని ప్రోత్సాహకాలను అందించేది. దీనివల్ల రిటైలర్లు ఫోన్ అధికారిక ధర (ఎంఆర్పీ)పై వినియోగదారులకు డిస్కౌంట్లు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లు ఇవ్వగలిగేవారు. అయితే, ఇప్పుడు యాపిల్ ఈ సపోర్ట్‌ను నిలిపివేస్తున్నట్లు నివేదికలు వస్తున్నాయి. దీంతో రిటైలర్లు ఇకపై భారీ తగ్గింపులు ప్రకటించే అవకాశం ఉండదు. ఈ నిర్ణయం వల్ల ఫోన్ల అధికారిక ధరలో ఎటువంటి మార్పు ఉండదు. కానీ, డిస్కౌంట్లు తగ్గడం వల్ల వినియోగదారుడు చెల్లించే తుది ధర పెరుగుతుంది. ముఖ్యంగా తక్కువ బడ్జెట్‌లో పాత ఐఫోన్ మోడల్‌ను కొనుగోలు చేయాలని భావించే వారిపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

మార్కెట్‌లో ధరలపై మరింత నియంత్రణ సాధించడం, పాత, కొత్త మోడళ్ల మధ్య ధరల వ్యత్యాసాన్ని తగ్గించి వినియోగదారులను కొత్త మోడళ్ల వైపు మళ్లించే వ్యూహంలో భాగంగానే యాపిల్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. యాపిల్ నుంచి దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## పెట్రోలుపై రష్యా నిషేధం..

### భారత్‌పై ప్రభావం ఎంత?




**న్యూఢిల్లీ:** పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం నెలకొంది. ఇలాంటి సమయంలో రష్యా కీలక ప్రకటన చేసింది. ఏప్రిల్ 1 నుంచి గ్యాసోలిన్ (పెట్రోల్) ఎగుమతులపై నిషేధం విధిస్తున్నట్లు వెల్లడించింది. దేశీయ సరఫరాకు ప్రాధాన్యం ఇచ్చేందుకు, ధరలను స్థిరీకరించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో భారత్‌పై ప్రభావం గురించి విశ్లేషణలు వస్తున్నాయి. భారత్ తన ముడి చమురు అవసరాల్లో 80 శాతం మేర దిగుమతులపైనే ఆధారపడుతుండగా, అందులో 20 శాతం రష్యా నుంచే వస్తున్నాయి. మన వద్దే భారీస్థాయిలో రిఫైనింగ్ సామర్థ్యం ఉండటంతో.. మన దిగుమతుల్లో పెట్రోలు లేదా ఇతర శుద్ధి చేసిన ఉత్పత్తుల వాటా స్వల్పమే. దేశంలో రిఫైనరీలు రోజుకు 5.6 మిలియన్ బ్యారెళ్ల మేర చమురును శుద్ధి చేస్తున్నాయి. ఈ రిఫైనింగ్ వల్ల దేశీయ అవసరాలు తీరడమే గాకుండా పలు ఉప ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. కాబట్టి గ్యాసోలిన్ ఎగుమతిపై రష్యా నిషేధం భారత్‌పై చూపే ప్రభావం పరిమితమే.

ఇదిలా ఉంటే.. మన ప్రభుత్వం కూడా ఎగుమతి సుంకాన్ని విధించిన సంగతి తెలిసిందే. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ముడి చమురు, గ్యాస్ దిగుమతులకు అవరోధాలు ఎదురవుతున్నాయి. దేశీయంగా ఇంధన కొరత పెరగకుండా చూసేందుకు, మనదేశం నుంచి పెట్రో ఉత్పత్తుల ఎగుమతులు పెరగకుండా చూసేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.

## ఆదాయపు పన్ను, పాన్, ట్రైన్ టికెట్..

### ఏప్రిల్ 1 నుంచి రాబోయే 15 మార్పులు!




**న్యూఢిల్లీ:** మరికొన్ని రోజుల్లో కొత్త ఆర్థిక సంవత్సరం (2026-27) ప్రారంభం కాబోతోంది. దీంతో ఏప్రిల్ 1 నుంచి అనేక ఆర్థిక పరమైన మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. ఏటా కొత్త ఆర్థిక సంవత్సరంలో ఈ మార్పులు సహజమే అయినప్పటికీ.. కొత్త ఆదాయపు పన్ను చట్టం, లేబర్ కోడ్స్, బడ్జెట్ ప్రతిపాదనలు, రైల్వే టికెట్ క్యాన్సిలేషన్ నిబంధనల్లో సవరణల కారణంగా ఈ సారి పెద్ద సంఖ్యలో మార్పులు ఉండబోతున్నాయి. కాబట్టి ఉద్యోగులు, సాధారణ పౌరులు, ట్రేడర్లు, రైలు ప్రయాణికులు ఈ మార్పుల గురించి తెలుసుకోవాల్సిందే..

**ఇన్‌కం ట్యాక్స్ యాక్ట్, 2025:** ఆదాయపు పన్ను చట్టం, 1961 స్థానే కొత్త ఆదాయపు పన్ను చట్టాన్ని కేంద్రం తీసుకొచ్చింది. ఏప్రిల్ 1 నుంచి కొత్త చట్టం అమల్లోకి రానుంది. సరళమైన భాషలో ఈ చట్టాన్ని రూపొందించారు. పన్నులు, పన్ను శ్లాబులు యథాతథంగా కొనసాగుతాయి.

**ట్యాక్స్ ఇయర్:** గతంలో ఫైనాన్షియల్ ఇయర్, అసెస్‌మెంట్ ఇయర్‌గా వ్యవహరించేవారు. దీంతో పన్ను చెల్లింపుదారులు గందరగోళానికి గురయ్యేవారు. ఇకపై ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు ఉండే కాలాన్ని ట్యాక్స్ ఇయర్‌గా వ్యవహరించనున్నారు.

హెచ్‌ఆర్‌ఏ 50 శాతం: ఇంటి అద్దె భత్యం (హెచ్‌ఆర్‌ఏ) కింద తమ మూల వేతనంలో 50% పన్ను మినహాయింపు పొందే నగరాల జాబితాను కేంద్రం ప్రస్తుత 4 నుంచి 8కి పెంచింది. ఇప్పటి వరకు దిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నై నగరాలకే పరిమితమైన ఈ ప్రయోజనాన్ని.. కొత్త నిబంధనల ద్వారా హైదరాబాద్, పుణె, అహ్మదాబాద్, బెంగళూరు నగరాలకూ విస్తరించింది.

**హెచ్‌ఆర్‌ఏ పొందాలంటే ఇవి తప్పనిసరి:** హెచ్‌ఆర్‌ఏ కింద మినహాయింపులు పొందాలంటే అద్దెదారు, ఇంటి యజమాని మధ్య ఉన్న అద్దె ఒప్పందం/సంబంధ వివరాలు వెల్లడించడం తప్పనిసరి. పాన్ వివరాలు కూడా ఇవ్వాలి. ఇది కూడా పాత పన్ను విధానం ఎంపిక చేసుకున్నవారికే!

కొత్త లేబర్ కోడ్ నిబంధనల ప్రకారం ఒక ఉద్యోగి బేసిక్ శాలరీ మొత్తం జీతంలో కనీసం 50% ఉండాలి. ప్రస్తుతం చాలా కంపెనీల్లో బేసిక్ పే 30-40% మాత్రమే ఉంటోంది. ఇది 50 శాతానికి పెరగడం వల్ల, దానిపై ఆధారపడి లెక్కించే పీఎఫ్, గ్రాట్యుటీ కంట్రిబ్యూషన్లు పెరుగుతాయి. ఈ మార్పు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.

**ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్‌పై పెంపు:** ఫ్యూచర్స్‌పై సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) 0.02 శాతం నుంచి 0.05 శాతానికి; ఆప్షన్స్ ప్రీమియం, ఆప్షన్స్‌పై ఎస్‌టీటీ 0.01 శాతం నుంచి వరుసగా 0.15శాతం, 0.125 శాతానికి పెంచుతూ బడ్జెట్‌లో నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఏప్రిల్ 1 నుంచి ఎఫ్‌అండ్‌ఓ ట్రేడర్లపై ఈ ప్రభావం పడనుంది.

**పాన్‌కు దరఖాస్తు నిబంధనలు:** ఇంతకుముందు పాన్ కార్డు పొందదాలంటే ఆధార్ సమర్పిస్తే సరిపోయేది. ఇకపై ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్, బర్త్ సర్టిఫికెట్ వంటి అదనపు పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

**రూ.10 లక్షలు దాటితే:** ఒక ఆర్థిక సంవత్సరంలో ఖాతాలో రూ.10 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ నగదు ఒకేసారి లేదా విడతల వారీగా జమ చేసినా, ఉపసంహరించుకున్నా పాన్ వివరాలు ఇకపై ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఒక రోజులో రూ.50 వేలు దాటితేనే పాన్ అడుగుతున్నారు.

ఇళ్లు, స్థలాల కొనుగోలు, అమ్మకం, బహుమతి లేదా ఉమ్మడి డెవలప్‌మెంట్ ఒప్పందాల విషయంలో లావాదేవీ విలువ రూ.20లక్షలు దాటితే ఇకపై పాన్ తప్పనిసరి. ప్రస్తుతం ఈ పరిమితి రూ.10 లక్షలుగా ఉంది.

# రోహిత్, రికెల్టన్ ఫైర్...

### భారీ స్కోర్ల మ్యాచ్ లో ముంబై విన్నర్

**ముంబై:** ఐపీఎల్ 2026 సీజన్‌లో పరుగులు వెల్లువెత్తిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ అద్భుత విజయాన్ని అందుకుంది. వాంఖడే స్టేడియం వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో, ముంబై 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత కేకేఆర్ నిర్దేశించిన 221 పరుగుల భారీ లక్ష్యాన్ని ముంబై బ్యాటర్లు మరో 5 బంతులు మిగిలి ఉండగానే, కేవలం 4 వికెట్లు కోల్పోయి 19.1 ఓవర్లలో ఛేదించారు. ఓపెనర్లు రోహిత్ శర్మ (78), ర్యాన్ రికెల్టన్ (81) సృష్టించిన విధ్వంసం ముందు కేకేఆర్ బౌలర్లు తేలిపోయారు.





221 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్‌కు ఓపెనర్లు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. రోహిత్ శర్మ, ర్యాన్ రికెల్టన్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. వీరిద్దరూ పోటీపడి బౌండరీలు, సిక్సర్లు బాదడంతో పవర్ ప్లే ముగిసేసరికి ముంబై వికెట్ నష్టపోకుండా 80 పరుగులు చేసింది. ఈ జోడీ కేవలం 11.5 ఓవర్లలోనే మొదటి వికెట్‌కు 148 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను పూర్తిగా ముంబై వైపు తిప్పేసింది.

రోహిత్ 38 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 78 పరుగులు చేయగా, రికెల్టన్ 43 బంతుల్లో 4 ఫోర్లు, 8 సిక్సర్లతో 81 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. వీరిద్దరూ అవుటైన తర్వాత సూర్యకుమార్ యాదవ్ (16), తిలక్ వర్మ (20) కూడా వేగంగా ఆడారు. చివర్లో కెప్టెన్ హార్దిక్ పాండ్యా (18 నాటౌట్) లాంఛనాన్ని పూర్తి చేశాడు.

అంతకుముందు, టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా నైట్ రైడర్స్ కూడా అద్భుతంగా రాణించింది. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 220 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ ఫిన్ అలెన్ (17 బంతుల్లో 37) మెరుపు ఆరంభాన్ని ఇవ్వగా, కెప్టెన్ అజింక్య రహానే (40 బంతుల్లో 67) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. యువ ఆటగాడు అంగ్‌క్రిష్ రఘువంశీ (29 బంతుల్లో 51) కూడా అద్భుతమైన హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు.

చివర్లో రింకూ సింగ్ (21 బంతుల్లో 33 నాటౌట్) వేగంగా పరుగులు చేయడంతో కేకేఆర్ భారీ స్కోరును నమోదు చేసింది. ముంబై బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ 3 వికెట్లతో రాణించాడు. అయితే, బ్యాటర్ల హవా నడిచిన ఈ మ్యాచ్‌లో ముంబై ఓపెనర్ల భాగస్వామ్యమే ఫలితాన్ని నిర్దేశించింది.

## వారిపై రెండేళ్ల నిషేధం సరిపోదు..

### మరిన్ని కఠిన చర్యలు తీసుకోవాల్సిందే.!

**ముంబై:** ఐపీఎల్ ఆరంభానికి ముందు కొందరు విదేశీ ఆటగాళ్లు ప్లేట్ ఫిరాయించడం పరిపాటి అయింది. నిరుడు హ్యారీ బ్రూక్, ఇప్పుడేమో బెన్ డకెట్ ఇద్దరూ ఇంగ్లండ్ ఆటగాళ్లు ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆఖరి నిమిషంలో హ్యాండిచ్చారు. జట్టు కూర్పు దాదాపు ఖరారైన సమయంలో క్రికెటర్లు 'మేము వైదొలుగుతున్నాం' అని చెప్పడాన్ని ఇక ఏమాత్రం తేలికగా తీసుకోవద్దని మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ అంటున్నాడు. ఆఖరి నిమిషంలో ఏదో సాకు చూపి మేము ఆడలేము అంటూ కూల్‌గా హ్యాండిచ్చే విదేశీ క్రికెటర్లపై రెండేళ్ల నిషేధం సరిపోదని, మరిన్ని కఠిన చర్యలు తీసుకోవాలని సన్నీ డిమాండ్ చేస్తున్నాడు.



ఐపీఎల్ సీజన్ ప్రారంభానికి ముందు ఏదో కారణంతో వైదొలిగే ఆటగాళ్లకు తగిన బుద్ధి చెప్పాలని గవాస్కర్ అభిప్రాయ పడుతున్నాడు. ప్రస్తుతం అమలులో ఉన్న శిక్ష వ్యవస్థను సమీక్షించాలని బీసీసీఐకి అతడు సూచించాడు. ఐపీఎల్ వేలంలో అమ్ముడైన ఆటగాళ్లు ఆఖరి నిమిషంలో వైదొలిగితే వారిపై రెండేళ్ల నిషేధం విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని గవాస్కర్ డిమాండ్ చేశాడు. మరొకరు ఇలాంటి పొరపాటు చేయకుండా చూసేందుకు గట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపాడు.

'యాషెస్ సిరీస్‌లో బెన్ డకెట్ బాగా ఆడాడు. ది హండ్రెడ్ వేలంలో అతడికి ఆశించినంత ధర దక్కలేదంటే పరిస్థితి వేరేలా ఉండేది. కానీ, అతడిక మంచి ధర వచ్చింది. అప్పుడు అతడు దేశం తరఫున ఆడడంపై దృష్టి సారించాలని ఫ్రాంచైజీకి చెప్పి ఉండాల్సింది. కానీ, మనోడు అలా చేయలేదు. ఇప్పుడు ఐపీఎల్ ఆడేందుకు దేశం కోసం ఆడాలని ఉందనే సాకు చూపించాడు. కాబట్టి.. ప్రస్తుతం అములో ఉన్న రెండేళ్ల నిషేధం పెద్దగా ఫలితమివ్వడం లేదు. అందుకని ఆటగాళ్లపై ప్రభావం పడేలా కఠిన చర్యలు తీసుకోవాలి. లేదంటే వారు రెండేళ్ల తర్వాత ఐపీఎల్ ఆడుతూనే ఉంటారు' అని గవాస్కర్ పేర్కొన్నాడు.

## విరామమే నా బలం..
## అందుకే ఫ్రెష్‌గా ఆడుతున్నా: కోహ్లీ

**బెంగళూరు:** ఐపీఎల్ 2026 సీజన్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఘన విజయంతో ప్రారంభించింది. శనివారం చిన్నస్వామి స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (69) అజేయ అర్ధశతకంతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ ఇటీవలే వన్డే క్రికెట్ ఆడటం తన లయను కొనసాగించడానికి బాగా ఉపయోగపడిందని కోహ్లీ వెల్లడించాడు.




ఈ మ్యాచ్‌లో కోహ్లీ 38 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 69 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో ఐపీఎల్ చరిత్రలో ఛేజింగ్‌లో 4000 పరుగులు పూర్తి చేసిన తొలి బ్యాటర్‌గానూ రికార్డు సృష్టించాడు. "చాలా కాలం తర్వాత టీ20 క్రికెట్ ఆడాను. ఇటీవల వన్డే సిరీస్‌లో బ్యాటింగ్ చేసిన తీరు అదే మొమెంటం కొనసాగించడానికి సహాయపడింది. నా సహజ శైలికి భిన్నమైన షాట్లు ఆడలేదు. శారీరకంగా ఫిట్‌గా ఉంటే, లయ దానంతట అదే వస్తుందని నాకు తెలుసు" అని మ్యాచ్ అనంతరం బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడుతూ కోహ్లీ పేర్కొన్నాడు.

క్రికెట్‌కు తీసుకునే విరామాలు తనను మానసికంగా తాజాగా ఉంచుతాయని కోహ్లీ చెప్పాడు. "గత 15 ఏళ్లుగా ఆడుతున్న తీరుకు అలసిపోయే ప్రమాదం ఉంది. ఈ విరామాల వల్ల నేను మానసికంగా ఫ్రెష్‌గా, ఉత్సాహంగా ఉంటాను. తిరిగి ఆడేందుకు వచ్చినప్పుడు 120 శాతం సిద్ధంగా ఉంటాను" అని వివరించాడు.

ఈ సందర్భంగా, దేవదత్ పడిక్కల్ (26 బంతుల్లో 61) ఇన్నింగ్స్‌పై కోహ్లీ ప్రశంసల వర్షం కురిపించాడు. "అది ఒక అద్భుతమైన ఇన్నింగ్స్. పడిక్కల్ ఆడుతున్న తీరు చూసి, అతడికి స్ట్రైక్ ఇవ్వడమే సరైందని భావించాను. అతడు మ్యాచ్‌ను పూర్తిగా మా వైపు తిప్పేశాడు. అతడి బ్యాటింగ్ టాలెంట్ ప్రపంచస్థాయిలో ఉంది" అని కొనియాడాడు. పడిక్కల్ దూకుడు వల్లే ఆర్‌సీబీ 202 పరుగుల భారీ లక్ష్యాన్ని మరో 26 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది.

# మళ్లీ రింగ్‌లోకి మణిపూర్ మణిపూస..

### ప్రొఫెషనల్ బాక్సింగ్‌కు సై..!

**న్యూఢిల్లీ:** భారత బాక్సింగ్ దిగ్గజం మేరీ కోమ్ మళ్లీ రింగ్‌లో అడుగుపెట్టనుంది. వీడ్కోలు పలికిన మణిపూర్ మణిపూస ఇకపై ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో చెలరేగాలని భావిస్తోంది. వయోపరిమితి కారణంగా అమెచ్యూర్ బాక్సింగ్‌లో పోటీ పడేందుకు అవకాశం లేనందున ప్రొషెషన్ బాక్సింగ్ మీద కన్నేసినట్టు ఆమె తెలిపింది. ఆదివారం ఫిట్ ఇండియా 67వ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఆమె ఈ విషయాన్ని ధ్రువీకరించింది.

మహిళా బాక్సింగ్‌లో లెజెండ్‌గా పేరొందిన మేరీ కోమ్ కొత్త ఇన్నింగ్స్ ఆరంభించనుంది. కొన్నాళ్లుగా బాక్సింగ్‌కు దూరమైన ఆమె త్వరలోనే ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో మెరవాలని భావిస్తోందీ ఒలింపిక్ కాంస్య పతక విజేత. 'ఆరుసార్లు వరల్డ్ ఛాంపియన్‌షిప్ గెలుపొందడం చాలా గొప్ప విషయం. వయోపరిమితి కారణంగా దేశం తరఫున అమెచ్యూర్ బాక్సింగ్ ఆడే అవకాశం లేని పరిస్థితి.

ఈ సమయంలో నాముందున్న ఆప్షన్ ప్రొఫెషనల్ బాక్సింగ్. ప్రస్తుతం ఈ ఆట




గురించి ఆలోచిస్తున్నా. ఈ వయసులోనూ నాలో చేవ తగ్గలేదని ప్రపంచానికి చాటాలనుకుంటున్నా. వయసుతో సంబంధం లేకుండా సాధ్యమైనన్ని రోజులు ఫిట్‌గా ఉండాలని అనకుంటున్నా అని 43 ఏళ్ల మేరీకోమ్ వెల్లడించింది.

**మహిళా బాక్సింగ్‌లో మహారాణి**

ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌కు చెందిన మేరీ కోమ్ భారత మహిళా బాక్సింగ్‌లో మహారాణిగా వెలుగొందింది. తన పవర్ పంచ్‌లతో ప్రత్యర్థులను పడగొట్టిన ఈ ఉక్కు మహిళ ఏకంగా ఆరుసార్లు (2002, 2005, 2006, 2008, 2010, 2018) ప్రపంచ ఛాంపియన్‌షిప్ విజేతగా నిలిచింది. 2012 లండన్ ఒలింపిక్స్‌లో కాంస్యంతో చరిత్ర సృష్టించి మేరీ కోమ్.. ఆసియా గేమ్స్‌లో పసిడి, కాంస్య పతకాలతో మెరిసింది.

2018 కామన్‌వెల్త్ క్రీడల్లోనూ పసిడి పతకం కొల్లగొట్టి తనకు తిరుగులేదని నిరూపించుకుంది. అయితే.. నిఖత్ జరీన్ రూపంలో మేరీ కోమ్‌కు గట్టి పోటీ ఎదురైంది. దాంతో.. అమెచ్యూర్ బాక్సింగ్‌కు దూరమైన ఈ స్టార్ బాక్సర్ సొంతంగా అకాడమీ నడుపుతూ యువ బాక్సర్లను తీర్చిదిద్దుతోంది.

## ‘సైరాట్’ దర్శకుడితో విజయ్ వర్మ ‘మట్కా కింగ్’..



**టాకీస్:** వైవిధ్యమైన పాత్రలతో బాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు విజయ్ వర్మ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు మేకర్స్ అదిరిపోయే సర్ప్రైజ్ ఇచ్చారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ క్రైమ్ డ్రామా సిరీస్ ‘మట్కా కింగ్’ విడుదలకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక ప్రైమ్ వీడియో ఈ సిరీస్ త్వరలోనే స్ట్రీమింగ్ కాబోతుండగా.. టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్.

1960ల నాటి ముంబై నేపథ్యంలో ఈ సిరీస్ తెరకెక్కింది. ఒక సాధారణ కాటన్ ట్రేడర్.. అప్పట్లో ముంబైని షేక్ చేసిన ‘మట్కా’ సామ్రాజ్యాన్ని ఎలా సృష్టించాడు, ఆ తర్వాత ఎలాంటి పరిణామాలు ఎదురయ్యాయి అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ సిరీస్ రూపొందింది. ఇందులో విజయ్ వర్మ లీడ్ రోల్ పోషిస్తున్నారు. ‘సైరాట్’ సినిమా డైరెక్టర్ నాగరాజ్ మంజులే ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. ఎస్ఆర్ఆర్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది.

## నవ్వుల విందుతో వచ్చేస్తున్న మలయాళ బ్లాక్ బస్టర్ ‘వాళ 2’..

### కట్టుకుంటున్న ట్రైలర్!




**టాకీస్:** గత ఏడాది మలయాళంలో సూపర్ హిట్ అయిన యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్ ‘వాళ’ చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న చిత్రం ‘వాళ 2’. ఈ చిత్రం సమ్మర్ కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. హ్యూమర్, ఎమోషన్స్ మరియు ఫ్రెండ్‌షిప్ కలబోతగా కట్ చేసిన ఈ ట్రైలర్ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. సరికొత్త కథనంతో వస్తున్న ఈ సీక్వెల్ ట్రైలర్‌లో ప్రముఖ దర్శకుడు అల్ఫోన్స్ పుత్రెన్ (ప్రేమమ్ ఫేమ్) పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించి సర్‌ప్రైజ్ చేశారు. అంతేకాకుండా ఆయన దర్శకత్వం వహించిన క్లాసిక్ మూవీ ‘ప్రేమమ్’పై వచ్చే కొన్ని ఫన్నీ డైలాగులు ట్రైలర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి విపిన్ దాస్ రచన అందించగా, సావిన్ ఎస్.ఎ. దర్శకత్వం వహించారు. ఇందులో హాషిర్, అజిన్ జాయ్, వినాయక్, అల్ఫోన్స్ పుత్రెన్, సుధీష్ తదితరులు కీలక పాత్రల్లో నటించగా, అంకిత్ మీనన్ సంగీతాన్ని సమకూర్చారు. ఈ చిత్రం ఏప్రిల్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. మొదటి భాగంలాగే ఈ సీక్వెల్ కూడా యువతను పెద్ద ఎత్తున అలరిస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.




## గ్లోబల్ స్టేజ్‌పై మెరిసిన ప్రియాంక చోప్రా...

### హాలీవుడ్ పాప్ స్టార్ పట్టించుకోలేదంటూ ట్రోలింగ్


టాకీస్: ప్రపంచ వేదికలపై భారతీయులు సత్తా చాటుతుంటే గర్వపడాల్సిన సమయంలో, వారినే తక్కువ చేయాలనే ధోరణి ఎంతవరకు సమంజసం అనే చర్చ ప్రస్తుతం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. ఈ వివాదానికి కేంద్రబిందువుగా నిలిచింది బాలీవుడ్ స్టార్ నుంచి గ్లోబల్ ఐకాన్‌గా ఎదిగిన ప్రియాంక చోప్రా. ఇటీవల మిలన్లో జరిగిన ప్రతిష్టాత్మక బల్గారీ జ్యువెలరీ ఈవెంట్ లో ప్రియాంక తన స్టైల్, గ్రేస్‌తో అందరినీ ఆకట్టుకున్నారు. అయితే ఆ వేడుకలో తీసిన ఒక వీడియోను ఆధారంగా చేసుకుని, హాలీవుడ్ పాప్ స్టార్ దువా లిపా ఆమెను పట్టించుకోలేదంటూ కొందరు నెటిజన్లు ట్రోలింగ్ మొదలుపెట్టారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారి తీశాయి. ఈ ట్రోలింగ్‌పై సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ విశ్వాస్ వర్మ తీవ్రంగా స్పందించారు. “ఒక భారతీయుడు విదేశాల్లో విజయాన్ని సాధిస్తే మనం ప్రోత్సహించాలి. కానీ మనవాళ్లే ప్రియాంక స్థాయిని ప్రశ్నిస్తూ విమర్శించడం బాధాకరం” అని ఆయన పేర్కొన్నారు. అలాగే, ప్రియాంక ఫొటోలు, వీడియోలను వాడుకుని మిలియన్ల వ్యూస్ సంపాదించే పాపరాజీ పేజీలు కూడా ఆమెను అవమానించే విధంగా పోస్టు లు చేయడం “విషపూరితమైన మనస్తత్వం”కి నిదర్శనమని ఆయన విమర్శించారు. విశ్వాస్ వర్మ చేసిన ఈ వ్యాఖ్యలకు మంచి స్పందన లభించింది. ముఖ్యంగా ఈ వీడియోను ప్రియాంక చోప్రా స్వయంగా లైక్ చేయడం గమనార్హం. అలాగే ప్రముఖ నటి రవీనా టాండన్, హర్లీన్ సేథి కూడా ఈ వీడియోకు మద్దతు తెలపడం ద్వారా ట్రోలింగ్‌కు వ్యతిరేకంగా నిలిచారు. ప్రియాంక చోప్రా ప్రస్తుతం బల్గారీ బ్రాండ్‌కు గ్లోబల్ అంబాసిడర్‌గా ఉన్నారు.

## ‘విశ్వంభర’ నుంచి డబుల్ ట్రీట్ రెడీ...

### ట్రైలర్‌తో పాటు రిలీజ్ డేట్ అనౌన్స్‌కు సన్నాహాలు

**టాకీస్:** మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం విశ్వంభర కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న ఈ చిత్రం మొదటి నుంచే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. అయితే వీఎఫ్ఎక్స్ పనుల్లో జాప్యం కారణంగా ఈ సినిమా విడుదల పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది.తాజా సమాచారం ప్రకారం, ‘విశ్వంభర’ నిర్మాణ పనులు ఇప్పుడు చివరి దశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ అభిమానులకు డబుల్ సర్ప్రైజ్ ఇవ్వడానికి సిద్ధమవుతోంది. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన పవర్‌ఫుల్ ట్రైలర్‌ను విడుదల చేయడమే కాకుండా, అదే సమయంలో కొత్త రిలీజ్ డేట్‌ను కూడా ప్రకటించేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

ముందుగా శ్రీరామనవమి సందర్భంగా ఈ




అప్‌డేట్ ఇవ్వాలని భావించినప్పటికీ, అదే సమయంలో ఇతర భారీ చిత్రాల అప్‌డేట్లు ఉండటంతో చిత్ర యూనిట్ తమ నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేసుకున్నట్లు సమాచారం. అయితే త్వరలోనే భారీ స్థాయిలో ప్రమోషన్స్ ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ యువీ క్రియేషన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. అందాల భామ త్రిష హీరోయిన్‌గా నటిస్తుండగా, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతాన్ని అందిస్తున్నారు.


ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొనగా, రాబోయే ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటే ఈ అంచనాలు మరింత రెట్టింపు అవుతాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి. విజువల్ ఎఫెక్ట్స్ ప్రధానంగా ఉండే ఈ సోషియో ఫాంటసీ చిత్రంలో చిరంజీవి మరోసారి కొత్త లుక్, పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారని సమాచారం. కాగా ‘విశ్వంభర’ నుంచి రాబోయే ట్రైలర్ మరియు రిలీజ్ డేట్ ప్రకటనపై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. మెగాస్టార్ నుంచి ఈ డబుల్ ట్రీట్ ఎప్పుడు వస్తుందా అని మెగా ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## ఒకే టైటిల్‌తో ముగ్గురు హీరోల సినిమాలు..

### టాలీవుడ్‌లో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్

టాకీస్: టాలీవుడ్‌లో సినిమాల టైటిల్స్ ఎంపిక ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటుంది. ముఖ్యంగా పాత హిట్ సినిమాల పేర్లను మళ్లీ ఉపయోగించడం ఒక ట్రెండ్‌గా మారింది. అదే క్రమంలో ఇప్పుడు క్లాసిక్ టైటిల్ నారీ నారీ నడుమ మురారి మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఒకే టైటిల్‌తో ముగ్గురు వేర్వేరు తరాల హీరోలు సినిమాలు చేయడం సినీ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.ఈ టైటిల్‌కు పునాది వేసింది నందమూరి నటసింహం నందమూరి బాలకృష్ణ నటించిన 1990 చిత్రం. దర్శకుడు కోదండరామిరెడ్డి తెరకెక్కించిన ఈ సినిమా అప్పట్లో భారీ విజయాన్ని సాధించింది. ఇద్దరు హీరోయిన్ల మధ్య చిక్కుకుపోయే హీరో పాత్రలో బాలకృష్ణ నటన ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించింది. ఈ చిత్రం ఇప్పటికీ క్లాసిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా గుర్తింపు పొందింది.

చాలా కాలం తర్వాత ఇదే టైటిల్‌ను యువ హీరో శర్వానంద్ తన సినిమాకు ఉపయోగించడం మరోసారి ఆసక్తిని రేపింది. సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ చిత్రం ఆధునిక కథాంశంతో ప్రేక్షకులను ఆకట్టుకుని బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. పాత టైటిల్ అయినప్పటికీ, కొత్త తరహా




ట్రీట్‌మెంట్‌తో రావడం ఈ సినిమాకు ప్లస్ అయ్యింది.ఇప్పుడు అదే టైటిల్‌ను మరో యంగ్ హీరో నాగశౌర్య తన తాజా చిత్రానికి ఫిక్స్ చేయడం విశేషంగా మారింది. గత కొంతకాలంగా సరైన విజయాలు లేక కెరీర్‌లో కొంత వెనుకబడ్డ నాగశౌర్య, ఈ లక్కీ టైటిల్‌తో తిరిగి సక్సెస్ ట్రాక్‌లోకి రావాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ వేగంగా జరుగుతోంది. అన్ని పనులు పూర్తి చేసుకుని ఇదే ఏడాది విడుదలకు సిద్ధమవుతోంది.

ఇక ఈ టైటిల్ మూడోసారి రిపీట్ అవుతుండటంతో, దీని వెనుక ఉన్న సెంటిమెంట్ కూడా చర్చకు దారి తీసింది. ఒకే టైటిల్‌తో ఒకే ఏడాదిలో రెండు సినిమాలు రావడం అరుదైన విషయంగా సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.

## థియేటర్లలో తగ్గిన ‘ఉస్తాద్ భగత్ సింగ్’ హవా..

### ఓటీటీలో స్ట్రీమింగ్‌కు సిద్ధం

టాకీస్: పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, మాస్ డైరెక్టర్ హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఉస్తాద్ భగత్ సింగ్ విడుదలకు ముందే భారీ అంచనాలు సొంతం చేసుకుంది. ‘గబ్బర్ సింగ్’ తర్వాత ఈ కాంబినేషన్‌లో వచ్చిన సినిమా కావడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. అందాల తారలు శ్రీలీల, రాశి ఖన్నా హీరోయిన్లుగా నటించడంతో సినిమాకు మంచి క్రేజ్ వచ్చింది.మార్చి 19న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి పాజిటివ్ టాక్ వచ్చినప్పటికీ, బాక్సాఫీస్ వద్ద అనుకున్న స్థాయిలో కలెక్షన్లు రాలేకపోయాయి. దీనికి ప్రధాన కారణంగా అదే సమయంలో విడుదలైన ధురంధర్ 2 చిత్రం. ఈ మూవీ భారీ విజయం నమోదు చేస్తున్న క్రమంలో ఉస్తాద్ భగత్ సింగ్ హవా తగ్గింది.

ధురంధర్ 2 సినిమా సృష్టిస్తున్న రికార్డుల దూకుడు మధ్య ‘ఉస్తాద్ భగత్ సింగ్’ తన థియేట్రికల్ రన్‌లో పూర్తి స్థాయిలో రాణించలేకపోయింది. ఈ పరిస్థితుల్లో మేకర్స్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సినిమాను త్వరగా ఓటీటీ ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించారు. ప్రముఖ డిజిటల్ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్రానికి సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను



ఇప్పటికే సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం, ‘ఉస్తాద్ భగత్ సింగ్’ను ఏప్రిల్ 24న ఓటీటీలో విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన త్వరలోనే వచ్చే అవకాశం ఉంది. థియేటర్లలో ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయిన ఈ సినిమా, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో మంచి రెస్పాన్స్ సాధిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.